సోమవారం
24-04-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 301
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

సూడాన్ సంక్షోభం తీవ్రతరం

ఆఫ్రికా దేశమైన సూడాన్‌లో సంక్షోభం తీవ్రతరమవుతున్నది. సైన్యం, అర్ధసైనిక దళాల మధ్య జరుగుతున్న భీకర పోరాటం రెండో వారానికి చేరింది. ఈ పోరులో ఇప్పటికి దాదాపు 500 మంది పౌరులు మరణించారు. వందల సంఖ్యలో గాయపడ్డారు.

2లో

అమృత్‌పాల్ అరెస్టు

- మోగా జిల్లాలో పట్టుకున్న పంజాబ్ పోలీసులు
- భింద్రన్‌వాలే స్వగ్రామంలోని గురుద్వారా నుంచి బయటకు వచ్చిన వేర్పాటువాది
- విమానంలో అసోం జైలుకు తరలింపు

చండీగఢ్: ఖలిస్తాన్ వేర్పాటువాద నేత, వారిస్ పంజాబ్ దే అధ్యక్షుడు అమృత్‌పాల్ సింగ్‌ను పంజాబ్ పోలీసులు ఎట్టకేలకు అరెస్టు చేశారు. ఆదివారం తెల్లవారుజామున మోగా జిల్లాలోని రోడె గ్రామంలో అమృత్‌పాల్‌ను అరెస్టు చేసినట్లు పంజాబ్ పోలీసులు ప్రకటించారు. ఖలిస్తానీ ఉద్యమ నాయకుడు జర్నైల్ సింగ్ భింద్రన్‌వాలేను చంపిన తర్వాత తనకు తాను రాడికల్ బోధకుడిగా చెప్పుకున్న అమృత్‌పాల్ కోసం నెల రోజుల పాటు సాగిన వేటను పంజాబ్ పోలీసులు ఆదివారం ముగించారు. మార్చి 18 నుంచి దాదాపు నెల రోజులకు పైగా అమృత్‌పాల్ కోసం గాలిస్తున్నారు. భింద్రన్‌వాలే స్వగ్రామమైన రోడెలోని గురుద్వారా నుంచి కోశ కత్తితో కూడిన సాంప్రదాయ దుస్తులతో బయటకు వచ్చిన అమృత్‌పాల్‌ను ఉదయం 6.45 గంటలకు అదుపులోకి తీసుకున్నారు. అక్కడే గత సంవత్సరం వారిస్ పంజాబ్ దే అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. అరెస్టు కావడానికి ముందు గురుద్వారాలో ప్రసంగించినట్లు గుర్తించారు. 'ఇది ముగింపు ఏమాత్రం కాదు' అని అతని వ్యాఖ్యానించినట్లు తెలుస్తోంది. 29 ఏళ్ల వ్యక్తిని కఠినమైన జాతీయ భద్రతా చట్టం (ఎన్‌ఎస్‌ఏ) కింద నిర్బంధించారు. డిబ్రూఘర్ సెంట్రల్ జైలులో ఉంచడానికి ప్రత్యేక విమానంలో అసోంకు తరలించారు. ప్రస్తుతం అదే జైలులో అతని 9 మంది అనుచరులు కూడా ఉన్నారు. ఇందుకోసం డిబ్రూగఢ్ సెంట్రల్ జైలు

- మిగతా 2 లో

నేటికీ ఎదురు చూపులే

- పంచాయతీలకు నిధుల కొరత
- పడకేసిన అభివృద్ధి
- అధికార పార్టీ సర్పంచ్‌ల్లోనూ ఆవేదన

విశాలాంధ్ర-విజయనగరం: గ్రామాలు అభివృద్ధికి నోచుకోవడం లేదు... మౌలిక సదుపాయాల కల్పనకు నిధుల్లేవు... చేపట్టిన పనులకు బిల్లులు చెల్లింపులు జరగడం లేదు... హరితరాయబారులకు జీతాల్లేవు... ఇదీ రాష్ట్రంలోని గ్రామాల పరిస్థితి. గ్రామ పరిధిలోని చిన్న చిన్న పనులు కూడా చేయించుకోలేని పరిస్థితులున్నాయని సర్పంచ్‌లు వాపోతున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అవగతం చేసుకోవచ్చు. తాము చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లుల కోసం ఎదురు చూపులు చూస్తున్నామని, ఆర్థిక సంఘం నిధులపైనే ఆధారపడాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆ నిధులను కూడా ఖాళీచేయడంతో గ్రామాభివృద్ధికి నిధుల కొరత ఏర్పడిందంటున్నారు. పంచాయతీలకు స్థానికంగా వచ్చే ఆదాయంతో గ్రామంలోని కాలువల నిర్వహణ కూడా చేపట్టడానికి చాలడం లేదంటున్నారు. ఇక తమ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకువచ్చిన సచివాలయ వ్యవస్థ ప్రజాసేవల వరకు బాగానే ఉన్నా... తమమాట చెల్లుబాటు కాని పరిస్థితిని తీసుకువచ్చాయని అధికార పార్టీకి చెందిన సర్పంచులే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్తమాన రాజకీయాల్లో సర్పంచ్ ఎన్నిక కూడా ఖరీదైన వ్యవహారంగానే మారిందనేది అందరూ ఎరిగిందే. చేతులు కాల్చుకొని మరీ పదవిని దక్కించుకున్నా... ఎటువంటి అభివృద్ధి చేయలేని స్థితిలో గ్రామాల్లో కనీస మర్యాద కొరవడుతోందనే మాట చాలామంది సర్పంచ్‌ల్లో విన్పిస్తోంది. ప్రతిపక్ష పార్టీకి చెందిన సర్పంచులు బహిరంగంగా విమర్శిస్తుంటే, అధికార పక్షం వారు మాత్రం మింగలేక కక్కలేక కాలం నెట్టుకుంటూ వస్తున్నారు. విజయనగరం జిల్లాలోని 777 గ్రామ పంచాయతీల్లో సగానికి పైగా గ్రామాల్లో ఇవే మాటలు విన్పిస్తున్నాయి. వాస్తవానికి పంచాయతీ రాజ్ వ్యవస్థ ఏర్పడిందే గ్రామాభివృద్ధి కోసం.

1992లో భారత రాజ్యాంగం 73వ చట్ట సవరణ ద్వారా పంచాయితీ రాజ్ వ్యవస్థ ఏర్పడింది. ఈ సవరణ 1993, ఏప్రిల్ 24 నుండి అమలులోకి వచ్చింది. గ్రామాభివృద్ధికి చట్టం ఉన్నప్పటికీ, స్థానిక స్వపరిపాలనకు స్థానిక పాలనా వ్యవస్థ దోహదపడుతుందని నమ్మిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి... 2019 గాంధీ జయంతి సందర్భంగా సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. తరువాత గ్రామ సచివాలయాల్లో 1.94 లక్షల మందికి ఉద్యోగులను నియమించారు. అలాగే ప్రజలకు సంక్షేమ పథకాలను అందించేందుకు గ్రామాల్లో ప్రతి 50 కుటుంబాలకు ఒక వలంటీర్‌ను ఏర్పాటు చేశారు.

దీంతో గ్రామ స్థాయిలో ఒక పటిష్ఠ వ్యవస్థ ఏర్పరిచారనే అభిప్రాయం వ్యక్తమైనా... తరువాత కాలంలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్ల వ్యవహార శైలిపై కూడా చాలా చోట్ల విమర్శలూ విన్పించాయి. వీటికి తోడు నిధులు అందుబాటులో లేకపోవడంతో సర్పంచ్‌లు కూడా ఆవేదన వ్యక్తం చేస్తూనే ఉన్నారు.ప్రభుత్వం అందించిన పింఛన్లు, పథకాల గురించి చెప్పుకోవడం మినహా పాలనాపరంగా తమ ముద్రలేదనే ఆవేదన సర్పంచ్‌ల్లో కన్పించింది. గ్రామాభివృద్ధికి అవసరమైన నిధులందించి, సచివాలయ వ్యవస్థ తమకు సహకరించినప్పుడే సంక్షేమంతో పాటు గ్రామాభివృద్ధికి అవకాశం ఉంటుందని సర్పంచ్‌లు అంటున్నారు. ఆ దిశగా ప్రభుత్వం తమకు అండగా ఉండాలని ఆకాంక్షిస్తున్నారు.

పులివెందులలో
సీబీఐ అధికారులు

వివేకా, అవినాశ్ నివాసాల పరిశీలన

విశాలాంధ్ర-పులివెందుల: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసును దర్యాప్తు చేస్తున్న సీబీఐ అధికారులు... మరోసారి పులివెందులలోని వివేకానందరెడ్డి ఇంటిని పరిశీలించారు. సోమవారం సుప్రీంకోర్టులో విచారణ ఉన్న నేపథ్యంలో సీబీఐ అధికారుల రాక ప్రాధాన్యత సంతరించుకుంది.

కొత్తగా వచ్చిన సీబీఐ 'సిట్' అధికారులు వివేకా ఇంట్లో హత్య జరిగిన బాత్‌రూమ్, బెడ్ రూమ్ ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం సమీపంలో ఉన్న ఎంపీ అవినాశ్‌రెడ్డి ఇంటి వద్దకు వెళ్లి ఆయన ఇంటి పరిసరాలను కూడా పరిశీలించారు. అవినాశ్‌రెడ్డి ఇంటి వద్ద ఉన్న పీఏ రమణారెడ్డితో సీబీఐ అధికారులు మాట్లాడారు. ఎంపీ అవినాశ్‌రెడ్డి ఆరోపణలపై కూడా సీబీఐ ఆరా తీస్తోంది. హత్య జరిగిన రోజు జమ్మలమడుగు వెళ్తుండగా తనకు ఫోన్ వస్తే తిరిగి వచ్చానని ఆయనకు సీబీఐ అధికారులకు తెలిపారు. దీనిపై నిజానిజాలను సీబీఐ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అవినాశ్ పీఏను పులివెందుల రింగ్ రోడ్డు వద్దకు తీసుకెళ్లారు. అవినాశ్ చెప్పింది నిర్ధరణ చేసుకునేందుకు పీఏను తీసుకెళ్లినట్లు తెలిసింది. ఎంత సమయంలో వివేకా ఇంటికి అవినాశ్ వచ్చారనే దానిపై ప్రధానంగా సీబీఐ అధికారులు దృష్టి పెట్టారు. హత్య జరిగిన రోజు అవినాశ్‌రెడ్డి తన ఇంటి నుంచి వివేకా ఇంటికి ఎంత సమయంలో రావొచ్చు అనేదానిపై సాంకేతికంగా ఇప్పటికే ఆధారాలు సేకరించిన అధికారులు ... మరోసారి క్షుణ్ణంగా తనిఖీ చేయడానికి వచ్చినట్టు తెలుస్తోంది. తిరిగి మళ్లీ వివేకా ఇంటికి వచ్చి సంఘటన జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. హత్య జరిగిన రోజు ఇంట్లో ఎవరెవరు ఉన్నారనే దానిపై వివేకా ఇంట్లో పనిచేసే కంప్యూటర్ ఆపరేటర్ ఇనయతుల్లాను సీబీఐ అధికారులు ప్రశ్నించారు. ఘటన జరిగిన రోజు వివేకా మృతదేహాన్ని ఫొటోలు, వీడియోలు తీసి ఇనయతుల్లా కుటుంబ సభ్యులకు పంపారు.

అప్పన్న చందనోత్సవంలో
అరకొర ఏర్పాట్లు

- కనీస వసతుల్లేక ఇబ్బందులు
- మంత్రులకు, అధికారులకు నిరసన సెగ
- ఘాట్ రోడ్డులో నిలిచిన వాహనాలు
- సరైన ఏర్పాట్లు చేయడంలో అధికారుల వైఫల్యం

2లో

రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్న మోదీ

- కేంద్రానికి దాసోహమైన జగన్ ప్రభుత్వం
- గన్నవరం ప్రచారభేరి సభలో రామకృష్ణ, రాఘవులు

విశాలాంధ్ర-గన్నవరం: కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం రాజ్యాంగానికి తూట్లు పొడుస్తోందని, 2024లో మళ్లీ గెలిస్తే రాజ్యాంగాన్ని తిరగరాస్తుందని సీపీఐ, సీపీఎం నాయకులు విమర్శించారు. ఆదివారం గన్నవరంలో ప్రజా వ్యతిరేక, నిరంకుశ, మతోన్మాద బీజేపీని సాగనంపుదాం... దేశాన్ని కాపాడదాం అంటూ ప్రచార భేరి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ గన్నవరం ప్రాంతం పోరాటాల పురిటిగడ్డ సుందరయ్య నడిచిన ప్రాంతమని అన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ 32 మంది బలిదానంతో సాధించుకున్న ఆంధ్రుల హక్కు అని తెలిపారు. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానన్న ప్రధాని మోదీ... పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు నష్టపోతున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. వేల కోట్ల అప్పులు తీసుకున్న వారిలో ఎక్కువమంది గుజరాతీవాళ్లేనని, అదానీ, అంబానీ ఆస్తుల విలువలు పెరిగాయో తప్ప పేద ప్రజల ఆదాయం పెరగలేదని అన్నారు. నల్లధనం తీసుకొస్తానని, ప్రజలకు పంచిపెడతానని చెప్పి 9 సంవత్సరాలయినా ఇంతవరకు చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు అమ్మటమే అజెండాగా మోదీ ప్రభుత్వం ఉందన్నారు. రాష్ట్రంలో జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి దాసోహమైందని తెలిపారు. నాకు 25 సీట్లు ఇస్తే ప్రత్యేక హోదా, పోలవరం సాధిస్తానని జగన్ చెప్పాడని, వాటిపై కేంద్రాన్ని ప్రశ్నించిందే లేదని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను అమ్ముతుంటే చూస్తూ ఊరుకుంటున్నావే తప్ప కేంద్రాన్ని ఎప్పుడైనా అడిగావా అని ప్రశ్నించారు. దళితులపై దాడులు జరిగితే పట్టించుకోకుండా, దళితులను చంపిన వారు జైలుకు వెళితే వైసీపీ నాయకులు వారికి దండాలు వేసేందుకు క్యూ కట్టారని, దళితులను ఆదుకోలేదని ధ్వజమెత్తారు. కమ్యూనిస్టులు, ప్రజాతంత్ర వాదులందరూ కలిసి పోరాటాలు చేసి భారతదేశాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని రామకృష్ణ అన్నారు. బి.వి.రాఘవులు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ విధానాలను సీపీఐ, సీపీఎం ప్రతిపక్ష హోదాలో నిలదీస్తున్నాయని తెలిపారు. కేంద్రం తప్పుడు విధానాలతో ప్రజలపై భారాలు మోపుతోందని, పెట్రోలు, డీజిల్ ధరలు ఆకాశాన్నంటినా పట్టించుకోలేదని విమర్శించారు. పేదలపై గ్యాస్ సిలిండర్ ధర భారం రూ.430 నుంచి సిలిండర్ రూ.1,200కు చేరిందన్నారు. ప్రతి సంవత్సరం రెండు నుంచి మూడు లక్షలు ఉద్యోగాలు ఇస్తానని హామీ ఇచ్చి, ప్రభుత్వ రంగాలను అమ్మేసి ఉద్యోగాలు ఎక్కడ నుంచి ఇస్తావని ప్రశ్నించారు. ఉద్యోగాలు లేకపోవడంతో యువకులు మాదకద్రవ్యాలకు అలవాటు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోందని, రాహుల్ గాంధీ మోదీని విమర్శించాడని, ఆయన పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేయించారని విమర్శించారు. రాష్ట్రంలో పిచ్చోడు చేతికి రాయి ఇచ్చినట్లుగా ఉందని, సీఎం జగన్... ప్రత్యేక హోదా, పోలవరం నిధులు అడగలేక, మోదీ చెప్పుల్లో కాళ్లు పెట్టి నడుస్తున్నట్టుగా ఉందన్నారు. ఆనాడు ఎన్టీఆర్ ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని కాపాడితే, ఈనాడు జగన్... మోదీకి ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టారని ధ్వజమెత్తారు. ఏపీకి రాజధాని లేని రాష్ట్రంగా గిన్నిస్ బుక్ రికార్డు ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కేవీవీ ప్రసాద్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు టి.తాతయ్య, అడ్డాడ ప్రసాద్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెలగపూడి ఆజాద్, సీపీఐ గన్నవరం నియోజకవర్గ కార్యదర్శి పెద్దు వాసుదేవరావు, సీపీఎం జిల్లా నాయకులు కె.వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు, గన్నవరం కార్యదర్శి మల్లంపల్లి ఆంజనేయులు, మల్లంపల్లి జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇదీ లోకం!

డీఎస్సీ మాయాజాలం

- ఉపాధ్యాయ నిరుద్యోగులకు జగన్ దగా
- నాలుగేళ్లుగా ప్రకటన జాప్యం
- నిర్ణీత వయస్సు దాటిన అభ్యర్థులు
- వేలాది మంది దరఖాస్తుకు అనర్హత
- వయోపరిమితి పెంపుపై మౌనం
- అతి తక్కువ పోస్టులతో భర్తీకి యత్నం



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: నాలుగేళ్ల నుంచి డీఎస్సీ ప్రకటన లేనందున, ప్రభుత్వం నిర్దేశించిన వయస్సు మించిపోయి వేలాది మంది దరఖాస్తు చేసేందుకు సైతం అనర్హులుగా మారారు. సకాలంలో డీఎస్సీ ఇవ్వనందునే ఈ దుస్థితి దాపురించిందని, ఎన్నికల ముందు కంటి తుడుపుగా డీఎస్సీ ఇస్తామంటూ జగన్ సర్కార్ ప్రకటిస్తోందని ఉపాధ్యాయ నిరుద్యోగ అభ్యర్థులు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇది ఉపాధ్యాయ నిరుద్యోగులకు జగన్ ప్రభుత్వం చేసిన పెద్ద మోసమని మండిపడుతున్నారు. గత చంద్రబాబు ప్రభుత్వ హయాంలో డీఎస్సీ-2018 నాటికి జనరల్ అభ్యర్థులకు 44 ఏళ్ల వరకు అవకాశం కల్పించారు. దీంతో రిజర్వేషన్ వర్గాలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ తదితరులకు 49 ఏళ్లలోపు వరకు (44+5=49) దరఖాస్తు చేసే అవకాశం వచ్చింది. జగన్ అధికారంలోకి రాక ముందు ప్రతి ఏటా 10 వేల పోస్టులతో జంబో డీఎస్సీ ఇస్తానని ప్రకటించగా, ఉపాధ్యాయ నిరుద్యోగులు ఆశపడి ఎన్నికల్లో జగన్‌కు మద్దతిచ్చారు. అప్పటికే డీఎస్సీకి దరఖాస్తు చేసేందుకు రోజులు, నెలలు, ఏడాదిలోపు నిర్ణీత గడువు ముగియనున్న వయస్సు వారంతా జగన్ వచ్చిన మొదటి ఏడాదిలోనే డీఎస్సీ వస్తుందని ఆశించారు. నాలుగేళ్ల వరకు డీఎస్సీ రాకపోవడంతో వారు దరఖాస్తు చేసేందుకు వయస్సు మీరిపోయి అనర్హులుగా మారనున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఈ నాలుగేళ్ల జాప్యాన్ని కలిపి డీఎస్సీకి దరఖాస్తు చేసేందుకుగాను జనరల్ అభ్యర్థులకు 48గా నిర్ణీత అర్హత వయస్సును ఖరారు చేసేలా

- మిగతా 2 లో

బీజేపీ అధికారంలోకి వస్తే
ముస్లిం రిజర్వేషన్లు తొలగిస్తాం

చేవెళ్ల సభలో కేంద్రమంత్రి అమిత్‌షా

విశాలాంధ్ర-మొయినాబాద్: తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగ విరుద్ధంగా ఉన్న ముస్లిం రిజర్వేషన్లను ఎత్తేస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రకటించారు. రిజర్వేషన్లు ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓబీసీలకు మాత్రమే ఉండాలని, అధికారంలో వారికి భాగస్వామ్యం దక్కాలన్నది బీజేపీ సంకల్పమని వెల్లడించారు. బీజేపీ అధికారంలోకి వస్తే తెలంగాణ విమోచన దినోత్సవాన్ని మరింత ఘనంగా నిర్వహిస్తామన్నారు. చేవెళ్ల కేవీఆర్ గ్రౌండ్స్‌లో

- మిగతా 2 లో

సూడాన్ సంక్షోభం తీవ్రతరం

- రెండో వారానికి చేరిన పోరాటం
- దౌత్య సిబ్బందిని తరలించిన అమెరికా

ఖార్తోమ్: ఆఫ్రికా దేశమైన సూడాన్‌లో సంక్షోభం తీవ్రతరమవుతున్నది. సైన్యం, అర్ధసైనిక దళాల మధ్య జరుగుతున్న భీకర పోరాటం రెండో వారానికి చేరింది. ఈ పోరులో ఇప్పటికి దాదాపు 500 మంది పౌరులు మరణించారు. వందల సంఖ్యలో గాయపడ్డారు. పోరాటం ఇంకా కొనసాగడంతో రాజధాని ఖార్తోమ్‌లోని రాయబార కార్యాలయం నుంచి దౌత్య ప్రతినిధులు, సిబ్బందిని అమెరికా ఖాళీ చేయించింది. అమెరికా సైన్యం సహకారంతో దౌత్య సిబ్బంది, వారి కుటుంబ సభ్యులను సురక్షితంగా సూడాన్ నుంచి బయటకు తరలించింది. తమ దేశానికి చెందిన దాదాపు 70 మంది సిబ్బందిని రాయబార కార్యాలయం నుంచి ఇథియోపియాలోని గుర్తు తెలియని ప్రదేశానికి విమానంలో తరలించినట్లు అమెరికా అధికార వర్గాలు తెలిపాయి. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కూడా ఈ విషయాన్ని ధృవీకరించారు. తన ఆదేశాల మేరకు ఖార్తోమ్ నుంచి అమెరికా దౌత్య సిబ్బందిని సురక్షితంగా బయటకు తెచ్చేందుకు అమెరికా సైన్యం ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించినట్లు ఒక ప్రకటనలో వెల్లడించారు. సుడాన్ రాజధాని ఖార్తోమ్‌లోని అమెరికా ఎంబసీని తాత్కాలికంగా మూసివేసినట్లు ఆయన వెల్లడించారు. కాగా, 2021 అక్టోబర్‌లో సైనిక తిరుగుబాటు వల్ల సూడాన్‌లో ప్రజాస్వామ్య ప్రభుత్వం కుప్పకూలింది. అనంతరం సూడాన్ ఆర్మీ చీఫ్ అబ్దేల్ ఫత్తా అల్ బుర్హాన్, ఆయన డిప్యూటీ, పారామిలిటరీ ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్ (ఆర్ఎస్ఎఫ్)కు నేతృత్వం వహిస్తున్న మొహమ్మద్ హమ్దాన్ దాగ్లో మధ్య విభేదాలు పెరిగాయి. ఈ నేపథ్యంలో ఆర్మీ, ఆర్ఎస్ఎఫ్ మధ్య గత కొన్ని రోజులుగా తీవ్ర పోరాటం జరుగుతున్నది. రెండు వర్గాలు పరస్పరం కాల్పులు, బాంబు దాడులకు పాల్పడుతున్నాయి. దీంతో సూడాన్‌లో ఎక్కడ చూసినా భీతావహ దృశ్యాలు కనిపిస్తున్నాయి. ఆర్మీ, పారామిలిటరీ మధ్య జరుగుతున్న పోరాటంలో వందలాది మంది సాధారణ పౌరులు మరణించారు. చాలా మంది మృతదేహాలు రోడ్డుపైనే పడి ఉన్నాయి.

27, 28 తేదీలో ఎస్‌సీఓ రక్షణ మంత్రుల భేటీ



బీజింగ్: షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) రక్షణ మంత్రుల సమావేశం ఈ నెల 27, 28 తేదీలలో భారతదేశ రాజధాని న్యూఢిల్లీలో జరగనున్నది. భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో ఉగ్రవాదం, ప్రాంతీయ భద్రత, ఆఫ్గానిస్థాన్‌లోని భద్రతా పరిస్థితి వంటి అంశాలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. ఈ సమావేశాలలో పాల్గొనేందుకు చైనా రక్షణ మంత్రి లీషాంగ్‌ఫూ, రష్యా రక్షణ మంత్రి సెర్గీ షోయగు భారత్ రానున్నారు. ఈ విషయాన్ని ఆయా దేశాలు ధ్రువీకరించాయి. పాక్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసీఫ్‌ను కూడా ఈ సమావేశానికి ఆహ్వానించారు. ఇప్పటి వరకు పాక్ మంత్రి హాజరుపై ఎటువంటి ధ్రువీకరణ రాలేదు. 2020లో గల్వాన్ ఘర్షణ తర్వాత చైనా రక్షణ మంత్రి భారత్‌కు రావడం ఇదే ప్రప్రథమం. సరిహద్దుల్లో కొన్ని పాయింట్ల వద్ద రెండు దేశాల మధ్య విభేదాలు కొనసాగుతున్న సమయంలో లీషాంగ్ పర్యటన జరగనుంది. మరోవైపు గతేడాది కూడా తవాంగ్ సెక్టార్‌లో యాంగత్సే వద్ద భారత్-చైనా దళాలు ఘర్షణపడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో లీషాంగ్‌ఫూ పర్యటన ప్రాధాన్యత సంతరించుకొంది. రష్యా రక్షణ మంత్రి షోయిగు కూడా ఉక్రెయిన్ యుద్ధం మొదలయ్యాక తొలిసారి భారత్‌లో పర్యటించను న్నారు. భారత్-రష్యా మధ్య ఉన్నత స్థాయిలో జరుగుతున్న సమావేశాల్లో ఇది కూడా భాగంగా నిలవనుంది. మే 5వ తేదీ నుంచి గోవాలో జరగనున్న ఎస్‌సీవో విదేశాంగ మంత్రుల సమావేశానికి పాక్‌మంత్రి బిలావల్ భుట్టో జర్దారీ హాజరుకానున్నారు. ఈ మేరకు ఇప్పటికే పాక్ నుంచి అధికారిక ధ్రువీకరణ వచ్చింది. పూంచ్‌లో సైనిక వాహనంపై దాడి జరిగడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. దర్యాప్తులో పాక్ పాత్రపై స్పష్టమైన ఆధారాలు లభ్యమైతే పరిస్థితి ఇబ్బందికరంగా మారవచ్చు.

ఈ ఏడాది 10లక్షలకు పైగా అమెరికా వీసాలు

వాషింగ్టన్: భారతీయులకు అమెరికా శుభవార్త చెప్పింది. ఈ ఏడాది మన దేశానికి చెందినవారికి రికార్డు స్థాయిలో 10 లక్షలకుపైగా వీసాలను జారీ చేయనున్నట్లు ప్రకటించింది. దీంతోపాటు విద్యా సంవత్సరం ప్రారంభం నాటికే భారతీయ విద్యార్థులందరికీ స్టూడెంట్ వీసాల ఆమోద ప్రక్రియను పూర్తి చేస్తామంది. అమెరికాకు చదువుల కోసం వెళు తున్న విదేశీ విద్యార్థుల్లో భారతీయులు రెండోస్థానంలో ఉన్నారు. భారతీయులు అధికంగా కోరుకునే హెచ్-1బీ, ఎల్ వర్క్ వీసాల జారీకి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు అమెరికా వెల్లడించింది. ఈ విషయమై అమెరికా విదేశాంగ శాఖలో సహాయ కార్యదర్శి డొనాల్డ్‌లు మాట్లాడుతూ "భారత్, అమెరికా ఆర్థిక వ్యవస్థలకు కీలకమైన వర్క్ వీసాలకు మేం ప్రాధాన్యం ఇస్తున్నాం. వీటి జారీకి భారత్‌లోని కొన్ని కాన్సులేట్‌లలో 60 రోజుల కన్నా తక్కువ సమయమే పడుతోంది" అని తెలిపారు. కొన్ని నాన్ ఇమ్మిగ్రెంట్ వీసాల రెన్యువల్‌కు పిటిషన్‌దారు స్వయంగా హాజరు కావాల్సి ఉండగా, ఇలాంటి వాటిని దేశీయంగానే పునరుద్ధరించే ప్రక్రియను ఈ ఏడాది చివర్లో ప్రయోగాత్మకంగా తిరిగి అమలు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. హెచ్-1బీ వీసాలు ఉండి ఉద్యోగాలు కోల్పోయిన ఐటీ నిపుణులు తమ హోదాను పునరుద్ధరించుకోవడానికి ఏమేం చేయాలో సూచిస్తూ అమెరికన్ హోంల్యాండ్ సెక్యూరిటీ విధివిధానాలను విడుదల చేసిందని పేర్కొన్నారు. "భారత్-అమెరికా ద్వైపాక్షిక సంబంధాలకు అమెరికాలో గొప్ప మద్దతు ఉంది. భారతీయ అమెరికన్లు గత మూడు దశాబ్దాలుగా అమెరికాలోనే ఉంటున్నారు. ఏటా 10 లక్షల మందికి పైగా ప్రజలు రెండు దేశాల మధ్య ప్రయాణిస్తూ ఉంటారు. ప్రస్తుతం లక్ష మంది వరకు అమెరికన్లు భారత్‌లోనూ నివసిస్తున్నారు" అని డొనాల్డ్ లు వివరించారు.

ప్రేమించిన యువతిపై అమానుషం

విశాలాంధ్ర-ఏలూరు: యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించిన కామాంధుడు... తన కోరిక తీర్చడానికి నిరాకరించిందని ఆమెను గదిలో నిర్బంధించి అనేక మార్లు ఆమెపై అత్యాచారానికి యత్నించాడు. ఆమె తన కోరిక తీర్చడానికి నిరాకరించిందన్న కసితో ఆమె ఒంటిపై వేడి నూనె పోసి చిత్ర హింసలకు గురి చేశాడు. ఈ అమానుష ఘటన ఏలూరు నగరంలో చోటుచేసుకుంది. వివరాలకు వెళ్తే... ఏలూరు మూడో పట్టణ పరిధి లోని దుగ్గిరాల ప్రాంతానికి చెందిన యువతి కాకినాడ జేఎన్టీయూలో ఇంజనీరింగ్ మూడో సంవత్సరం చదువుతోంది. ఆమెకు తల్లి, తండ్రి, ఒక సోదరి ఉన్నారు. తండ్రి ఆటో నడుపుకుంటూ జీవనాన్ని సాగిస్తున్నాడు. ఈ క్రమంలో అదే దుగ్గిరాల జోసఫ్ ప్రాంతానికి చెందిన ఎస్ అనుదీప్ అనే యువకుడితో నాలుగేళ్ల క్రితం పరిచయమైంది. అప్పటినుంచి ప్రేమించుకుంటున్నారు. ఈ క్రమంలో ఈ నెల 9వ తేదీన అనుదీప్ ఆ యువతికి ఫోన్ చేసి తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. అదేరోజు కాకినాడ వెళ్లి ఆమెను కాకినాడ నుండి ఏలూరు నగరానికి తీసుకుని వచ్చాడు. నేరుగా తన ఇంటికి తీసుకువెళ్లి అక్కడ ఆమెను నిర్బంధించాడు. రాత్రి సమయంలో ఆమె తన కోరిక తీర్చాలని బలవంతం చేశాడు. దీనికి ఆమె నిరాకరించింది. మరుసటి రోజు 10వ తేదీ మద్యం తాగిన అనుదీప్ ... యువతి వద్దకు వచ్చి ఆమెను కోరిక తీర్చాలని బలవంతం చేశాడు. ఆమె మాట వినకపోవడంతో వేడి నూనె ఆమె కాళ్లు చేతులపై పోసి ఆమె పై పోశాడు. అంతటితో ఆగకుండా ఆమెను దాదాపు 14 రోజులపాటు గదిలో బంధించి ఉంచాడు. ఆదివారం ఉదయం ఆమెను చంపేస్తానని బెదిరించి దాడితో గొంతుపై నులిమేందుకు ప్రయత్నం చేస్తున్న సమయంలో ఆమె అతడి నుండి తప్పించుకుని తండ్రికి ఫోన్ చేసింది. వెంటనే అప్రమత్తమైన తండ్రి ఆమెను చికిత్స నిమిత్తం ఏలూరు జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాడు. చేతులపై కాళ్లపై తీవ్ర గాయాలు కావడంతో వైద్యులు ఆమెకు చికిత్స అందిస్తున్నారు. పోలీసులు మూడో పట్టణ పోలీసులు ఆమె ఇచ్చిన ఫిర్యాదు పై అనుదీప్ పై హత్యాయత్నం, అత్యాచారం, పది రోజుల పైబడి నిర్బంధించటం, దాడి చేయడం వంటి అనేక సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రస్తుతం అనుదీప్ పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.

డీఎస్సీ మాయాజాలం

(మొదటిపేజీ తరువాయి)

చూడాలని, అదే విధానం రిజర్వేషన్ వర్గాలకూ అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

పోస్టులపై గందరగోళం

డీఎస్సీ పోస్టులపై గందరగోళం నెలకొంది. అసలెన్ని పోస్టులనేదీ ప్రభుత్వం దగ్గర లెక్కలు లేని పరిస్థితి దాపురించింది. నెల రోజుల క్రితం ప్రభుత్వ లెక్కల ప్రకారం కేవలం 700 పైచిలుకు ఉపాధ్యాయ ఖాళీలే ఉన్నట్లు తేల్చగా, రాబోయే డీఎస్సీకి అవి ఎంత పెరుగుతాయనేదీ స్పష్టత లేదు. సీఎం జగన్ ఆదేశాలతో డీఈవోల నుంచి ఖాళీలపై లెక్కలు తీసేందుకు పాఠశాల ఉన్నతాధికారులు సిద్ధమయ్యారు. సీఎం జగన్ ప్రభుత్వం నాలుగేళ్ల తర్వాత ఇప్పుడు ఉన్న పళంగా డీఎస్సీ అంశం తెర పైకి తీసుకు రావడం చర్చనీయాంశంగా మారింది. ఇటీవల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీకి ఘోర పరాజయం ఎదురైంది. పోటీ చేసిన మూడు సీట్లలోనూ ఓటమి పాలైంది. దానికితోడు మరో ఏడాదిలోగా సార్వత్రిక ఎన్నికలు రానున్నాయి. వాటన్నిటిని దృష్టిలో ఉంచుకుని జగన్ డీఎస్సీ ప్రకటనతో నిరుద్యోగులను ఊరించేందుకు ప్రయత్నాలు ఆరంభించింది. ఇటీవల సీఎం జగన్‌ను విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ కలిసిన అనంతరం త్వరలో డీఎస్సీ ఉంటుందని, దానిపై కసరత్తు చేస్తున్నామంటూ మీడియాకు లీకులిచ్చారు. ఇప్పటివరకు పాత, పెండింగ్ డీఎస్సీలలో అర్హత సాధించిన వారిని కనీస వేతన విధానంతో ప్రభుత్వం భర్తీ చేసి... ఆ పోస్టులన్నీ జనరల్ డీఎస్సీగా చిత్రీకరించి అభాసుపాలైంది. ఇటీవల శాసన మండలిలోనూ నాలుగేళ్లలో ఎన్ని డీఎస్సీలు ఇచ్చారు?, పోస్టులెన్ని భర్తీ చేశారంటూ పీడీఎఫ్ సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి బొత్స సత్యనారాయణ నుంచి ఇదే సమాధానం వచ్చింది. పాత పెండింగ్ డీఎస్సీల్లో ఉన్న పదులు, వందల పోస్టులను జనరల్ డీఎస్సీ కింద లెక్కల్లోకి చూపారు. అదే సమయంలో ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలు కేవలం 700 పైగా ఉన్నట్లు తేల్చి చెప్పారు. మంత్రి ఇచ్చిన వివరణతో పీడీఎఫ్ ఎమ్మెల్సీలు విస్తుపోయారు. తీవ్ర ఆగ్రహా నికి గురయ్యారు. అటు నాలుగేళ్లుగా డీఎస్సీ కోసం శిక్షణ తీసుకుంటున్న నిరుద్యోగులు ఆందోళన చెందారు. ఇప్పుడు రాబోయే డీఎస్సీ ఎన్ని పోస్టులతో ఉంటుందనేదీ ప్రశ్నార్థకంగా మారింది. మంత్రి ప్రకటించిన ఆ కొద్దిపాటి పోస్టులతోనే డీఎస్సీ నిర్వహిస్తారా? లేక ఇంకా పోస్టులు కలిపి ప్రకటిస్తారా? అనేదీ ప్రశ్నార్థకంగా మారింది.

ప్రతి ఏటా పది వేలతో డీఎస్సీ దగా

జగన్ అధికారంలోకి రాక ముందు తన పాదయాత్రలోను, ఎన్నికల మేనిఫెస్టో లోనూ ప్రతి ఏటా పది వేల పోస్టులతో డీఎస్సీ ఇస్తానంటూ హామీ ఇచ్చి పూర్తిగా విస్మరించారు. నాలుగేళ్లవుతున్నప్పటికీ... ఇంతవరకు ఒక్క జనరల్ డీఎస్సీ ఇవ్వలేక పోయారు. ఇది ఉపాధ్యాయ శిక్షణ పొందిన అభ్యర్థులకు శాపంగా మారింది. ప్రాథమిక పాఠశాలలను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడంతోనే ఈ సమస్య తలెత్తింది. దానికితోడు ఇంగ్లీషు మీడియం ప్రవేశపెట్టడం, తెలుగు మీడియం ఉపాధ్యా యులను కుదించి వేయడంతో పోస్టులు మరింతగా తగ్గిపోయాయి. ఉపాధ్యాయుల పదవీ విరమణ 62 ఏళ్లకు పెంచడంతో పోస్టులు తగ్గిపోయాయి. జగన్ అధికారంలోకి వచ్చే నాటికి 30 వేలకుపైగా ఉపాధ్యాయ ఖాళీలున్నప్పటికీ, ఈ నాలుగేళ్లలో అవి కేవలం 700 పైబడి ఖాళీగా చూపడంపై అనేక అనుమానాలున్నాయి. ఇది నిరుద్యో గులకు ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసినట్లవుతుంది. ఎన్నికల మేనిఫెస్టోలో 98 శాతం అమలు చేశామంటూ గొప్పలు చెప్పుకుంటున్న జగన్ ప్రభుత్వం... ఆ హామీలోనే ప్రతి ఏటా జంబో డీఎస్సీ ఉన్నప్పటికీ, దానిని ఎక్కడి అమలు చేశారంటూ నిరుద్యోగులు ప్రశ్నిస్తున్నారు. నాలుగేళ్లుగా వేల కొద్దీ వెచ్చించి కోచింగ్ సెంటర్లలో శిక్షణ తీసుకుని వారంతా అప్పుల పాలయ్యారు. మొదటి కరోనాకు ముందే డీఎస్సీ వస్తుందంటూ ప్రభుత్వం ప్రకటించి చేతులెత్తేసింది. నాలుగేళ్లుగా ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) లనూ సరిగ్గా ప్రభుత్వం నిర్వహించలేకపోయింది. ప్రతి ఏటా రెండు టెట్‌లు నిర్వహిం చవలసి ఉండగా, దాని లెక్క ప్రకారం నాలుగేళ్లల్లో ఎనిమిది టెట్‌లు నిర్వహించాలి. ఇటీవల కేవలం ఒక టెట్‌నే ప్రభుత్వం నిర్వహించింది. నాడు-నేడు కింద పాఠశాలల రూపురేఖలను మార్చామని ప్రభుత్వం ప్రచారం చేసుకుంటున్నా అక్కడ బోధించేందుకు అవసరమైన ఉపాధ్యాయుల భర్తీ లేకపోతే ఎలా అని ప్రశ్నిస్తున్నారు.

అప్పన్న చందనోత్సవంలో అరకొర ఏర్పాట్లు

విశాలాంధ్ర-సింహాచలం (విశాఖ జిల్లా): సింహాద్రి అప్పన్న చందనోత్సవంలో భక్తుల అవస్థలు వర్ణనాతీతం... మండుటెండలో భక్తులకు చుక్కలు చూపించారు... అర్ధరాత్రి నుంచి దర్శనం కోసం వేచి చూసిన భక్తులకు తీవ్ర నిరాశ ఎదురైంది. ఏర్పాట్లు చేయడంలో అధికారులు ఘోరంగా విఫలమయ్యారని శారదా పీఠం స్వామీజీ స్వరూపానంద సరస్వతి, భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రులకు నిరసన సెగ తప్పలేదు. వీవీఐపి పేరిట జారీ చేసిన ప్రత్యేక టికెట్లు, కొంతమంది అధికారుల బంధుగణం, ట్రస్ట్ బోర్డు సభ్యుల హవా ను నియంత్రించకపోవడమే దీనికి ప్రధాన కారణమని భక్తులు మండిపడుతున్నారు. ఈఓ డౌన్ డౌన్ అంటూ క్యూ లైన్లలో ఉన్న భక్తులు నినాదాలు చేశారు. దర్శనానికి వచ్చిన దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, బొత్స సత్యనారాయణ, గుడివాడ అమర్నాథ్, సీదిరి అప్పల రాజులకు నిరసనలు తప్పలేదు. భక్తులు ఆగ్రహంతో నిలదీశారు. మంచినీటి సౌకర్యం కల్పించకపోవడంతో కొంతమంది భక్తులు కళ్లు తిరిగిపడిపోయారు. కాగా సింహాచలం అప్పన్న చందనోత్సవానికి వచ్చిన భక్తులకు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కొండ దిగువన అరకిలోమీటరు వరకు ఆర్టీసీ బస్సుల్లో భక్తులు వేచి ఉన్నారు. గంటల తరబడి నిలిపివేయడంతో భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కొండమీదకు ఎప్పుడు అనుమతి ఇస్తారని అధికారులను ప్రశ్నించారు. చిన్న పిల్లలు, వృద్ధులతో వచ్చిన వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మండుటెండలో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించడంలోను దేవస్థానం అధికారులు వైఫల్యం చెందారు. ఇంత ఘోరం ఎప్పుడూ చూడలేదని భక్తులు మండిపడుతున్నారు. ఒక దశలో కొండమీదకు పంపించాలని భక్తులు పోలీసులతో వాగ్వా దానికి దిగారు. దీంతో ఘాటు రోడ్ వద్ద ట్రాఫిక్ క్లియర్ అయిన తర్వాతే ఆర్టీసీ బస్సులను కొండపైకి పంపిస్తామని వారు చెప్పారు. ప్రభుత్వం మంత్రులకు, ఎమ్మెల్యేలకు, వారి అనుచరులకు, బంధు గణానికి మాత్రమే పెద్దపీట వేసిందే కానీ సామాన్య భక్తులకు అప్పన్న చందనోత్సవంలో చోటు కల్పించలేదని అనేకమంది భక్తులు విచారం వ్యక్తం చేశారు.

అశోక్ గజపతిరాజు దంపతులకు తొలి దర్శనం

ఏడాది మొత్తం చందనం పూతలో ఉండే సింహాచలం వరాహ లక్ష్మీనరసింహస్వామి ఆదివారం (వైశాఖ శుక్లపక్ష తదియ నాడు) భక్తులకు నిజరూపంలో దర్శనమిస్తున్నారు. చందనోత్సవంగా పేర్కొనే ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామి వారిని దర్శించుకునేందుకు లక్షలాది మంది భక్తులు తరలివస్తున్నారు. ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు దంపతులు, వారి కుటుంబ సభ్యులకు తొలిదర్శనం కల్పించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం తరపున స్వామి వారికి దేవదాయ శాఖా మంత్రి కొట్టు సత్యనారాయణ పట్టువస్త్రాలు సమర్పించారు. తెల్లవారుజాము ఐదు గంటల నుంచి సామాన్య భక్తులకు దర్శనాలు కల్పిస్తున్నారు. కాగా సింహాచల వరాహ లక్ష్మీ నరసింహ స్వామికి టీటీడీ తరపున చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పట్టు వస్త్రాలు సమర్పించి దర్శనం చేసుకున్నారు. అలాగే హైకోర్టు న్యాయమూర్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

దర్శనానికి ఎందుకు వచ్చానా అని బాధపడుతున్నా: స్వరూపానంద

విశాఖ శారద పీఠాధిపతులు స్వరూపానందేంద్రస్వామి, స్వాత్మానంద స్వాములు అప్పన్న దర్శనం అనంతరం మీడియాతో మాట్లాడుతూ... చందనోత్సవం ఏర్పాట్లపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ రోజు చందనోత్సవం జరిగినట్లు ఎప్పుడూ జరగలేదని , ఇంత ఘోరంగా ఏర్పాట్లు చేశారని, గర్భాలయంలో పోలీసులు జులుం ఎక్కువయ్యిందన్నారు. భక్తులకు ఎటువంటి సౌకర్యాలు లేకపోగా, దేవస్థానంలో అధికారులు, పోలీసులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారన్నారు. ఆరు నెలలుగా దేవాలయానికి ఈఓ లేకుండా ఇన్‌చార్జితో నడపడం దారుణమని, గర్భాలయంలో ఆచారం, మడి, సంప్రదాయం లేకుండా పోలీసుల మయం అయ్యిందని ఆవేదన వ్యక్తం చేశారు. సింహాచలం చరిత్రలో ఈరోజు దుర్దినమని, లైన్లలో ఉన్న భక్తులను చూస్తే కళ్లల్లో నీళ్లు వస్తున్నాయని, అసలు దర్శనానికి ఎందుకు వచ్చానా అని అనిపించిందని ఆవేదన చెందారు. ఈ వీఐపి ల దర్శన మేమిటి, అప్పన్న స్వామి పేదల దేవుడని, ధనవంతుల దేవుడు కాదని స్వామీజీ ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పన్న చందనోత్సవ ఏర్పాట్లపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సామాన్య భక్తులను దేవుడికి దూరం చేసేలా అధికారులు వ్యవహరించారని, గుంపులుగా పోలీసులను పెట్టారు తప్ప ఏర్పాట్లు సరిగా లేవని విమర్శించారు. తన జీవితంలో తొలిసారి ఇలాంటి చందనోత్సవానికి హాజరయ్యానని, ఏర్పాట్లపై ప్రభుత్వం నిర్లక్ష్యమే కారణమన్నారు. కొండ కింద నుంచి పై వరకు రద్దీ ఉన్నా జవాబు చెప్పేవారు లేరని స్వరూపానందేంద్ర సరస్వతి ఆవేదన వ్యక్తం చేశారు. తన జీవితంలో ఇలాంటి దౌర్భాగ్యం ఎప్పుడూ చూడలేదన్నారు. ఈ చందనోత్సవం లో విశాఖ జిల్లా కలెక్టర్ మల్లికార్జున, దేవదాయ శాఖ కమిషనర్ ఎస్ సత్యనారాయణ, డిప్యూటీ అసెంబ్లీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి దంపతులు, విశాఖ నగరం మేయర్ గొలగాని హరి వెంకట్ కుమారి దంపతులు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, చైర్మన్లు లతోపాటు ఉన్నతాధికారులు రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు.

ముస్లిం రిజర్వేషన్లు తొలగిస్తాం

(మొదటిపేజీ తరువాయి)

బీజేపీ ఆదివారం సాయంత్రం నిర్వహించిన విజయ సంకల్ప సభకు హాజరైన అమిత్ షా ప్రసంగించారు. చిలుకూరు బాలాజీ ఆశీర్వాదంతో మాట్లాడుతున్నానంటూ మొదలుపెట్టారు. బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్‌పై విరుచుకుపడ్డారు. కేసీఆర్ ప్రధాని అవ్వాలని కలలు కంటున్నారని, ప్రధాని సీటు ఖాళీగా లేదన్న విషయాన్ని కేసీఆర్ తెలుసుకోవాలన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ బీజేపీనే గెలుస్తుంది, మోదీనే మరోసారి ప్రధాని అవుతారని ఆయన జోస్యం చెప్పారు. కేసీఆర్ తన ముఖ్యమంత్రి పీఠం కాపాడుకుంటే చాలని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ అవినీతి పాలనను, కేసీఆర్ అరాచక పాలనను ప్రజలు గమనిస్తున్నా రన్నారు. 9 ఏళ్లుగా కొనసాగుతున్న బీఆర్ఎస్ అవినీతి పాలనకు చరమగీతం పాడాలని పేర్కొన్నారు. ఢిల్లీలో ఉన్న ప్రియతమ ప్రధాని నరేంద్ర మోదీ గారికి వినిపించేలా నినాదాలు చేయాలంటూ తెలంగాణలో బీజేపీ సర్కార్ రావాలా వద్దా? అని సభను ఉద్దేశించి ఉద్వేగంగా మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ నేతలపై అకృత్యాలు జరుగుతున్నాయని ఆరోపించారు. పేపర్ లీక్ పై ప్రశ్నించిన బండి సంజయ్‌ని జైల్లో పెట్టారని, అయితే 24 గంటల్లోనే బెయిల్ వచ్చిందని అమిత్ షా తెలిపారు. ఆయన ఏం తప్పు చేశారని ప్రశ్నించారు. బీజేపీ కార్యకర్తలు ఇలాంటి అక్రమ అరెస్టులకు భయపడబోరని స్పష్టం చేశారు. కేసీఆర్ అసెంబ్లీలో తమ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ను మాట్లాడనివ్వడంలేదని విమర్శించారు. కేసీఆర్ ఎన్ని ప్రయత్నాలు చేసినా మోదీ నుంచి ప్రజలను దూరం చేయలేరన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ గెలవడాన్ని ఎవరు ఆపలేరని చెప్పు కున్నారు. తెలంగాణలో యువతకు అన్యాయం జరుగుతోందని, టీఎస్ పీఎస్సీ ప్రశ్నపత్రాలు, పదో తరగతి పేపర్ లీక్ కావడం సిగ్గుచేటని అన్నారు. లక్షలాది యువత భవిష్యత్తును కేసీఆర్ సర్కారు నాశనం చేస్తోందన్నారు. రానున్న ఎన్నికల్లో యువతే కేసీఆర్ కు తగిన బుద్ధి చెబుతారని చెప్పు కొచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో ఒవైసీ అజెండానే కేసీఆర్ అమలు చేస్తున్నారని విమర్శించారు. కారు స్టీరింగ్ ఎంఐఎం చేతు ల్లోనే ఉందని, కేసీఆర్ కుటుంబం తెలంగాణను ఏటీఎంగా మార్చుకున్న విషయాన్ని తెలంగాణ ప్రజలు గుర్తించారని అమిత్‌షా ధ్వజమెత్తారు. ఈ సభలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్, బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జి తరుణ్ చుగ్, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే ఈటల రాజేందర్, మాజీ మంత్రి డీకే అరుణ, మాజీ మంత్రి చంద్రశేఖర్, ఎమ్మెల్సీ మురళీధర్, లక్ష్మణ్, వీరేందర్‌గౌడ్, రాష్ట్ర, జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

సమసమాజ స్థాపనకు కృషి చేసిన బసవేశ్వరుడు

బసవ భవన్ నిర్మాణానికి రూ.10 కోట్లు: సీఎం కేసీఆర్

విశాలాంధ్ర- హైదరాబాద్: సామాజిక ఆధ్యాత్మిక విప్లవకారుడు, సమ సమాజ స్థాపనకోసం కృషి చేసిన భారతీయ దార్శని కుడు, నాటి కాలం ప్రజా నాయకుడు బసవేశ్వరుని జయంతి సందర్భాన్ని పురస్క రించుకుని వీరశైవ లింగాయత్‌లు, లింగ బలిజలు సహా రాష్ట్ర, దేశ ప్రజలకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు శుభాకాంక్షలు తెలిపారు. వారు జాతికి చేసిన సేవలను, బోధనలను సీఎం కేసీఆర్ స్మరించు కున్నారు. ఆనాటి సమాజంలో నెలకొన్న మత చాంధస విలువలను సంస్కరిస్తూ, సాంఘిక దురాచారాలమీద పోరాటం చేయడమేకాకుండా, వర్ణ వివక్ష, కుల వివక్ష, లింగవివక్ష లేని సమాజం కోసం దాదాపు 900 ఏళ్ల క్రితమే పోరాడిన సామాజిక దార్శనికుడు బసవేశ్వరుడు అని సీఎం కొనియాడారు. 'అనుభవ మంటపం' వ్యవస్థను ఏర్పాటు చేసి, అన్ని కులాలకు అందులో ప్రాతినిధ్యం కల్పించి, నాటి కాలంలోనే పార్లమెంటరీ ప్రజాస్వామిక పాలనకు బీజాలు వేశారన్నారు. బసవేశ్వరుని జయంతిని ఏటా రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తూ, వారి ఆశయాల సాధన దిశగా కార్యాచరణ చేపట్టిందని సీఎం తెలిపారు. బసవేశ్వరుని స్ఫూర్తిని రేపటి తరాలు కొనసాగించేందుకు గుర్తుగా వారి కాంస్య విగ్రహాన్ని ట్యాంకుబండ్ మీద నెలకొల్పుకున్నామన్నారు. హైదరాబాద్ కోకాపేటలోని అత్యంత ఖరీదైన ప్రాంతంలో బసవ భవన్ నిర్మాణానికి రూ.10 కోట్ల రూపాయల నిధులను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిందని సీఎం తెలిపారు. కుల మతాలకు అతీతంగా మనుషులంతా ఒక్కటేననే బసవేశ్వరుని సమతా తాత్వికతను రాష్ట్ర ప్రభుత్వం కొనసాగిస్తుందని సీఎం అన్నారు. దళిత బహుజన కులాల గిరిజన, మహిళా అట్టడుగు వర్గాల సంక్షేమం అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తూ బసవేశ్వరుని ఆశయాలను కొనసాగిస్తామని కేసీఆర్ స్పష్టం చేశారు.

అమృత్‌పాల్ అరెస్టు

(మొదటిపేజీ తరువాయి)

వద్ద బహుళ అంచెల భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. జైలు కాంపౌండ్‌ను అసోం పోలీసు శాఖలోని ఎలైట్ బ్లాక్ క్యాట్ కమాండోలు, సీఆర్‌పీఎఫ్, జైలు భద్రతా సిబ్బంది తమ ఆధీనంలోకి తీసుకున్నారు. జైలు లోపల కూడా భద్రతను కట్టుదిట్టం చేశామని పోలీసులు తెలిపారు. విమానాశ్రయం నుంచి డిబ్రూగఢ్ జైలు వరకు 15 కి.మీ దూరం వరకు రోడ్డు క్లియరెన్స్ కోసం స్థానిక ట్రాఫిక్ పోలీసులను సైతం అప్రమత్తం చేశారు. కాగా, అమృత్‌పాల్ అరెస్టయిన కొద్ది సేపటికే, ఒక వీడియో ఆన్‌లైన్‌లో కనిపించింది. దీనిలో వేర్పాటువాది లొంగిపోతున్నట్లు సూచిస్తూ సంక్షిప్త ప్రసం గాన్ని అందిస్తున్నట్లు కనిపించింది. 1984లో అమృత్ సర్‌లోని స్వర్ణ దేవాయలంలో ఉన్న ఉగ్రవాదులను ఏరి వేయడానికి వివాదాస్పద సైనిక ఆపరేషన్‌లో మరణించిన భింద్రన్‌వాలే చిత్రపటం ముందు అతను కూర్చున్నట్లు మరొక దృశ్యం కనిపించింది. పోలీసు ఇన్‌స్పెక్టర్ జనరల్ సుఖ్‌చైన్ సింగ్ గిల్ మాట్లాడుతూ ఇది 'లొంగిపోవడమే' అనే అమృత్‌పాల్ వాదనను ఖండించారు. పారిపోయిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఆయన చెప్పారు. 'అమృత్‌సర్ పోలీసులు, పంజాబ్ పోలీసుల ఇంటెలిజెన్స్ విభాగం సంయుక్త ఆపరేషన్ నిర్వహించాయి. పంజాబ్ పోలీసు లతో కార్యాచరణ సమాచారం ఆధారంగా అతను గ్రామం రోడేలో ఉన్నాడు. అతనిని అన్ని వైపుల నుంచి చుట్టు ముట్టాం. ఆ గ్రామాన్ని పంజాబ్ పోలీసులు చుట్టు ముట్టారు' అని పోలీసు అధికారి వివరించారు. పోలీసులు గురుద్వారాలోకి ప్రవేశించలేదని అన్నారు. 'గురుద్వారా పవిత్రతను కాపాడుకోవడం చాలా ముఖ్యం. యూని ఫాంలో ఉన్న పోలీసులు లోపలికి ప్రవేశించలేరు', అతను తప్పించుకునే అవకాశం లేదని బోధకుడికి సందేశం అందించాం' అని ఆయన చెప్పారు. 'అమృత్‌పాల్ సింగ్‌పై జాతీయ భద్రతా చట్టం వారెంట్లు జారీ అయ్యాయి. ఈ రోజు ఉదయం వాటిని అమలు చేశారు. ఇంకా, చట్టం దాని స్వంత పనిని తీసుకుంటుంది' అని అన్నారు. అమృత్‌పాల్ అరెస్టయిన కొన్ని గంటల తర్వాత ముఖ్య మంత్రి భగవంత్ మాన్ ఒక వీడియో సందేశంలో, రాష్ట్రంలో శాంతి, సామరస్యాలకు విఘాతం కలిగించే వారు చట్టాన్ని ఎదుర్కొంటారని, అమాయకులకు ఇబ్బంది కలిగించబోమని స్పష్టం చేశారు. అరెస్టుకు దారితీసిన రాత్రి సమయంలో తాను నిరంతరం పరిణామాలను పర్యవేక్షించానని మాన్ చెప్పారు. కాగా, ఈ వేర్పాటువాది లొంగిపోవడానికి సిద్ధమైనప్పుడు అమృత్‌పాల్ సింగ్‌ను గురుద్వారాలో కలిశానని మాజీ అకల్ తఖ్త్ జతేదార్ జస్బీర్ సింగ్ రోడే చెప్పారు. గురుద్వారాకు సంబంధిం చిన ఒక వీడియో దృశ్యంలో, పరారీలో అమృత్‌పాల్... రోడె భింద్రన్‌వాలే జన్మస్థలమని, తన స్వంత 'దస్తర్ బందీ' (తలపాగా కట్టే కార్యక్రమం) జరిగిన గ్రామం అని గుర్తు చేసుకున్నాడు. అతను వారిస్ పంజాబ్ దే అధ్యక్షు డిగా బాధ్యతలు చేపట్టడం గురించి ప్రస్తావించాడు. అతను పరారీలో ఉన్నప్పుడు సిక్కులకు వ్యతిరేకంగా ప్రభుత్వం మితిమీరిన చర్యలు చేపట్టిందని, భద్రతా సంస్థలు తనను అరెస్టు చేయడం కంటే ప్రజలను వేధిం చాలనుకుంటున్నాయని సూచించినట్లు అతను తెలిపాడు. అరెస్ట్ వారి లక్ష్యం అయితే తాను వారికి సహకరించేవాడి నని అన్నారు. 'నేను లొంగిపోవాలని నిర్ణయించుకున్నాను. ఈ అరెస్టు అంతం కాదు, ఇది ప్రారంభం' అని అన్నాడు. 'సర్వశక్తిమంతుని న్యాయస్థానంలో తాను దోషి కాదని చెప్పాడు. ఇదిలాఉండగా, ఫిబ్రవరిలో అమృత్‌పాల్ సింగ్, అతని మద్దతుదారులు బారికేడ్లను బద్దలు కొట్టి అమృత్ సర్ నగర శివార్లలోని అజ్నాలా పోలీస్ స్టేషన్ లోకి ప్రవేశించి తన సహాయకుడిని విడుదల చేయాలని పోలీసులతో ఘర్షణకు దిగారు. సుమారు మూడు వారాల తర్వాత, మార్చి 18న అమృత్‌పాల్ సింగ్‌పై పోలీసులు అణిచివేత ప్రారంభించారు. పాకిస్తాన్ గూఢచారి సంస్థ ఐఎస్ఐతో సంబంధాలు కలిగి ఉన్నాడని, 'ఖలిస్థాన్' ప్రత్యేక దేశం కోసం పిలుపుని పునరుద్ధరించే ప్రయ త్నంలో సిక్కు యువకులను సమూలంగా మార్చే దిశగా కృషి చేస్తున్నాడని ఆందోళనలు ఉన్నాయి. అమృత్‌పాల్ సింగ్ గత సంవత్సరం దుబాయ్ నుంచి తిరిగి వచ్చి, ఉద్యమకారుడు-గాయకుడు దీప్ సిద్ధూ మరణం తర్వాత వారిస్ పంజాబ్ దే బాధ్యతలు చేపట్టాడు. యువకులలో మాదకద్రవ్యాల వ్యసనంపై పోరాడటం అనేది ప్రకటించిన లక్ష్యాలలో ఒకటి. సామరస్యానికి విఘాతం కలిగించడం, హత్యాయత్నం చేయడం, పోలీసు సిబ్బందిపై దాడి చేయడం, ప్రభుత్వోద్యోగులు చట్టబద్ధంగా విధులు నిర్వర్తించకుండా అడ్డుకోవడం వంటి ఆరోపణలపై ఆయనపై, అతని సహచరులపై అనేక కేసులు నమోద య్యాయి. అతను ఫిబ్రవరిలో వివాహం చేసుకున్న బ్రిటన్‌కు చెందిన కిరణ్‌దీప్ కౌర్‌ను వివాహం చేసుకున్నాడు. ఇటీవల కౌర్ అమృత్‌సర్ విమానాశ్రయం నుంచి లండన్‌కు వెళ్లే విమానం ఎక్కకుండా నిలిపివేశారు. చాలా మంది సానుభూతిపరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు, అయితే వారిలో ఎక్కువ మందిని అకల్ తఖ్త్, శిరోమణి గురుద్వారా పర్బంధక్ కమిటీ యువకులు వేధింపులకు గురిచేస్తున్నారని పేర్కొన్నందున విడుదల చేశారు. అమృత్‌పాల్ సహచరులని ఆరోపించిన తొమ్మిది మంది డిబ్రూఘర్ జైలులో ఉన్నారు. వారు దల్జీత్ సింగ్ కల్సి, పాపల్‌ప్రీత్ సింగ్, కుల్వంత్ సింగ్ ధలివాల్, వరీందర్ సింగ్ జోహల్, గుర్మీత్ సింగ్ బుక్కన్‌వాలా, హర్జిత్ సింగ్, భగవంత్ సింగ్, బసంత్ సింగ్, గురిందర్ పాల్ సింగ్ ఔజ్లా. అమృతపాల్ సింగ్‌ను తరలిస్తున్న విమానం ఆదివారం మధ్యాహ్నం దిబ్రూగఢ్‌లో దిగింది.

35 రోజులుగా ఆపరేషన్

అమృత్ పాల్ కోసం పంజాబ్ నుంచి నేపాల్ వరకు పోలీసులు గాలించారు. అయితే వేర్వేరు వేషాల్లో తప్పించుకుంటూ పోలీసులకు సవాల్ విసిరాడు. అతని కోసం వేట ప్రారంభమైనప్పటి నుంచి రెండుసార్లు పోలీసుల నుంచి తప్పించుకున్నాడు. గత 35 రోజులుగా అమృత్‌పాల్ సింగ్‌ను పట్టుకోవడానికి ఆపరేషన్ కొనసాగుతోందని ఉన్నతాధికారి తెలిపారు. ఆదివారం పక్కా సమాచారం సేకరించి మొత్తం ఆపరేషన్ చేపట్టారనీ, చట్ట ప్రకారం.. తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. శాంతిభద్రతలు కాపాడాలని పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. దీంతో పాటు నకిలీ వార్తలను షేర్ చేయవద్దని ప్రజలను కోరారు. సామాజిక మాధ్యమాలలో ఎలాంటి వదంతులను పట్టించుకోవద్దని పోలీసులు స్పష్టం చేశారు.

అమృత్‌పాల్ సింగ్ నేపథ్యం

1993లో అమృత్‌సర్‌లోని జల్లూపూర్ ఖేరా గ్రామంలో జన్మించిన అమృత్ పాల్ 12వ తరగతి వరకు చదువుకుని 2012లో దుబాయ్ లోని తన మేనమామ ట్రాన్స్ పోర్ట్ కంపెనీలో పని చేసేందుకు భారత్ ను విడిచి వెళ్లాడు. 30 ఏళ్ల అమృత్ పాల్ సింగ్ ఆరు నెలల క్రితం నటుడు, ఉద్యమకారుడు దీప్ సిద్ధూ స్థాపించిన 'వారిస్ పంజాబ్ దే' అనే సంస్థకు అధిపతిగా నియమితులయ్యాడు. 2022 ఫిబ్రవరిలో రోడ్డు ప్రమాదంలో మరణించిన సిద్ధూను 'ప్రభుత్వం' హత్య చేసిందని అమృత్ పాల్ సింగ్, ఆయన మద్దతుదారులు ఆరోపిస్తున్నారు. అమృత్ పాల్ ఎప్పుడూ సిద్ధూను వ్యక్తిగతంగా కలవలేదనీ, అయితే వారి ఆన్ లైన్ ముఖాముఖిలో ఆయనను తీవ్రంగా ప్రభావితం చేశారని చెప్పారు. ఖలిస్థాన్ వేర్పాటువాది, ఉగ్రవాది జర్నైల్ సింగ్ భింద్రన్ వాలే అనుచరుడిగా చెప్పుకునే ఆయన తన మద్దతుదారుల్లో 'భింద్రన్ వాలే 2.0'గా ప్రసిద్ధి చెందారు.

మూల్యాంకనపై త్వరలో నూతన విధానం

పది మూల్యాంకనపై సీఎం ఆరా జగన్ ఆదేశాలతో ప్రవీణ్ ప్రకాశ్ తనిఖీలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రశ్నాపత్రాల మూల్యాంకనకు సంబంధించి సాధ్యమైనంత త్వరలో నూతన విధానాన్ని రూపొందిస్తామని పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాశ్ తెలిపారు. వివిధ మూల్యాంకన కేంద్రాలు దశాబ్దాలుగా కొనసాగుతున్నాయని, ప్రస్తుత అవసరాలకు వాటిని మరింత మెరుగు పరిచాల్సి ఉందని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ సూచించినట్లు చెప్పారు. మూల్యాంకన కేంద్రం కోసం కొత్త విధానాన్ని రూపొందించేందుకు విశాఖపట్నం, విజయనగరం కేంద్రాలను సందర్శించి తగిన సమాచారం తీసుకుంటామని తెలిపారు. పదో తరగతి విద్యార్థుల జవాబు పత్రాలను స్పాట్ మూల్యాంకనం చేస్తున్న ఉపాధ్యాయులకు కల్పించిన సౌకర్యాలపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరా తీశారు. ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకుని మూల్యాంకన విధులకు హాజరయ్యే ఉపాధ్యాయులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలంటూ ఆదేశించారు. సీఎం ఆదేశాలతో వివిధ జిల్లాల్లోని మూల్యాంకన కేంద్రాల్లోని ఏర్పాట్లను ప్రవీణ్ ప్రకాశ్ ఆదివారం తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థుల జవాబు పత్రాలను స్పాట్ మూల్యాంకనం చేస్తున్న 25 వేల మంది ఉపాధ్యాయులకు కల్పించిన సౌకర్యాలపై సీఎం జగన్ ఆరా తీశారని వెల్లడించారు. ఈ నెల 19న ప్రారంభమైన మూల్యాంకన క్యాంపు 26 వరకు కొనసాగుతుందని, ఈ నేపథ్యంలో ఆయా కేంద్రాలను సందర్శించాలని తనతో పాటు ఇతర ఉన్నతాధికారులను సీఎం ఆదేశించినట్లు వివరించారు. మూల్యాంకన కేంద్రంలో ఉపాధ్యాయులకు ఎలాంటి సమస్యలు లేకుండా అన్ని వసతులు కల్పించాలన్నారు. గుంటూరు జిల్లా నగరంపాలెంలోని స్టాల్ గర్ల్స్ హైస్కూల్, పల్నాడు జిల్లాలోని సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌ను సందర్శించి, మూల్యాంకనంలో పాల్గొన్న ఉపాధ్యాయులందరితో సంభాషించారు. ప్రభుత్వం వారికి అందించిన అన్ని సౌకర్యాలను వ్యక్తిగతంగా తనిఖీ చేశారు. బల్లలు, కుర్చీలు, లైటింగ్, ఫ్యాన్లు, తాగునీటి వసతి, టాయిలెట్ల నిర్వహణ తదితరాలకు సంబంధించిన అంశాలపై చర్చించారు. ఈ మేరకు అదే సమయంలో ఇతర జిల్లాల్లోని కేంద్రాలనూ సందర్శించాలని ప్రవీణ్ ప్రకాష్ ఉన్నతాధికారులను కోరారు.

విస్తృతంగా ఏర్పాట్లు చేశాం

దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ వెల్లడి

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: చందనోత్సవం సందర్భంగా ఆదివారం రెండు లక్షలు పైగా భక్తులు వరాహ లక్ష్మీనరసింహస్వామి నిజ రూప దర్శనం చేసుకున్నట్లు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ వెల్లడించారు. సింహాచలం దేవాలయ ప్రాంగణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ సంతృప్తికరంగా స్వామి వారి నిజరూప దర్శనం చేసుకున్నారన్నారు. చందనోత్సవాలపై నెల రోజుల ముందు నుండే భక్తుల రాకను దృష్టిలో పెట్టుకొని జిల్లా కలెక్టర్, నగర పోలీసు కమిషనర్, దేవదాయ శాఖ కమిషనర్, జీవీఎంసీ కమిషనర్, తదితర అధికారులుతో చర్చించి ఎవరెవరు ఏ ఏ విధులు నిర్వహించాలో నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకొని విస్తృతమైన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. రెవెన్యూ, పోలీసు, దేవదాయ శాఖలు మంచి ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. భక్తులకు ఎక్కడా ఎలాంటి అసౌకర్యం కలుగకుండా తగు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఘాట్ రోడ్ లో ఒక వాహనం మరమ్మతులకు గురి కావడం వలన ట్రాఫిక్ రాక పోకలకు చిన్న పాటి అంతరాయం కలిగిందని, సెలవు దినాలు కావడంతో భక్తులు రద్దీ పెరిగిందన్నారు. రెండు, మూడు స్లాట్ లలో టికెట్లు పొందిన భక్తులు ఒకేసారి దర్శనానికి రావడంతో రద్దీ ఏర్పడినట్లు వివరించారు. ఏ సంవత్సరం చేయని విధంగా ఈ యేదాది ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. భక్తులు సంతృప్తికరంగా స్వామి వారిని దర్శించుకున్నారన్నారు. ఈ సమావేశంలో దేవదాయ శాఖ కమిషనర్ సీర సత్యనారాయణ, చందనోత్స వాల ప్రత్యేక అధికారి ఆజాద్, ఆలయ ఈఓ త్రినాథ్ రావు, తదితరులు పాల్గొన్నారు.

సహకార వ్యవస్థలో రెండంచెల విధానమే ఉండాలి

విశాలాంధ్ర, విజయవాడ (గాంధీ నగర్) : సహకార పరపతి వ్యవస్థ గ్రామీణ రైతాంగానికి సమర్థ సేవలందించాలంటే రెండంచెల విధానాన్ని ప్రవేశపెట్టాలని అల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసి యేషన్ కార్యదర్శి, ఆంధ్రా, తెలంగాణ బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి బి.ఎస్. రాంబాబు అన్నారు. అదివారం విజయవాడలోని ఒక హోటల్‌లో ఆంధ్రప్రదేశ్ కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ విస్తృత సమావేశం నిర్వహించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ...195 సెక్షన్ ప్రకారం సహకార బ్యాంకులు, వ్యవస్థలపై పన్ను విధించాలని కేంద్రం నిర్ణయించి అమలు చేస్తోందన్నారు. కో-ఆపరేటివ్ బ్యాంకులు 2 శాతం పన్ను చెల్లించాలనే నిబంధన అమలు సరికాదని, దీనివల్ల కో ఆపరేటివ్ వ్యవస్థలు నష్టాల్లో కూరుకుపోయి కుప్పకూలే ప్రమాదం ఉందన్నారు. కేంద్రం మొండిగా అమలు చేస్తే రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారన్నారు.

తక్షణం సహకార బ్యాంకులపై పన్నులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 14 రాష్ట్రాల్లో అమల్లో ఉన్న మూడు అంచెల వ్యవస్థల స్థానంలో రెండంచెల వ్యవస్థ ఏర్పాటు చేయాలన్నారు.ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో రెండంచెల విధానం అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. డీసీబీ బ్యాంకులను ఆప్కాబ్ బ్రాంచిలుగా మార్పు చేసి రైతులకు వడ్డీలపై రాయితీ ఇవ్వాలన్నారు. వడ్డీలో రాయితీలు ఇవ్వడం వల్ల రైతులకు అనేక రకాలుగా ప్రయోజనం జరుగుతుందన్నారు. కో ఆపరేటివ్ బ్యాంకు ఉద్యోగులకు పదవీ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని, పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకార బ్యాంకులు, ఉద్యోగులు ఎదుర్కొంటోన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేని పక్షంలో సమస్యల పరిష్కారం కోసం త్వరలో ఆందోళనలకు పిలుపునిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ వెలుగూరి రాధాకృష్ణ, ఎంప్లాయిస్ అసోసియేసన్ వైస్ చైర్మన్ తోట రామారావు, కార్యనిర్వాహక అధ్యక్షులు జి.నారాయణరెడ్డి, రవి కుమార్, సి.హెచ్.మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

విఐటీ-ఏపీలో వ్యాపార ప్రణాళిక పోటీలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఐక్య రాజ్యసమితి ప్రపంచ సృజనాత్మకత, ఆవిష్కరణ దినోత్సవంగా వీఐటీ- ఏపీ విశ్వవిద్యాలయం, వీఐటీ-ఏపీ స్కూల్ ఆఫ్ బిజినెస్ (విఎస్‌బి), వీఐటీ-ఏపీ టీబీఐ ఫౌండేషన్ (వీటీ బీఐఎఫ్) సహకారంతో జాతీయ స్థాయి వ్యాపార ప్రణాళిక పోటీలు విజయవంతంగా నిర్వహించారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆవిష్కరణ, వ్యవస్థాపకత ప్రాముఖ్యతపై అవగాహన పెంచడానికి జాతీయ స్థాయి వ్యాపార ప్రణాళిక పోటీలు ప్రత్యేక ఆకర్షణగా నిలి చాయి. ఈ పోటీలకు అగ్రిటెక్, హెల్త్‌కేర్, వెల్‌నెస్, ఆటోమేషన్ డీప్‌టెక్ రంగాలలో ఐక్యరాజ్యసమితికి చెందిన సస్టైయినబుల్ గోల్స్‌కి సంబంధించిన నాలుగు విభాగాల క్రింద మొత్తం 443 బృందాలు దేశవ్యాప్తంగా నమోదు చేసుకున్నాయి. వీటిలో గ్రాండ్ ఫినాలేలో తమ వ్యాపార ప్రణాళికను రూపొందించడానికి 50 జట్లను ఎంపిక చేశారు. నాలుగు ట్రాక్‌లకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల క్రింద విజేతలకు రూ.లక్షా 80వేల చొప్పున బహుమతులు అందజేశారు. ముఖ్య అతిథిగా అపెక్స్ సొల్యూషన్స్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నరేంద్ర కుమార్ శరణం హాజరయ్యారు. వ్యవస్థాపకత, విలువసృష్టి ద్వారా దేశ నిర్మాణం యొక్క ప్రాముఖ్యతపై వర్ధమాన పారిశ్రామికవేత్తలను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థులు ఉద్యోగార్థులుగా కాకుండా ఉద్యోగ ప్రదాతగా ఉండాలని సూచించారు. గౌరవ అతిథిగా హాజరైన టీఐఈ ప్రెసిడెంట్ రవి మాట్లాడుతూ... స్ఫూర్తి ప్రదాతలుగా నిలిచిన వ్యాపారవేత్తల విజయాలను వివరించారు. వీఐటీ-ఏపీ విశ్వ విద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎస్వీ కోట రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు, అధ్యాపకులలో పరిశోధన, ఆవిష్కరణలు, ఇంక్యుబేషన్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్‌ను ప్రోత్సహించడానికి వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయ యాజమాన్యం చేపట్టిన వివిధ కార్యక్రమాలను ప్రస్తావించారు. విశ్వవిద్యాలయం ప్రారంభమైనప్పటి నుండి 232 పేటెంట్లు, 1200o ఇండెక్స్ జర్నల్స్, 20o ఇంక్యు బెటర్లు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ల స్థాపన ద్వారా అనేక విజయాలతో వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయం ముందుకెళ్తోం దన్నారు. వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ చంద్ర ముదిగంటి, విద్యార్థులు తమ నైపుణ్యాలను మెరుగు పరుచుకోవడానికి వ్యాపార ప్రణాళిక పోటీలు దోహదపడతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో వీ-లాంచ్ పాడ్ కన్వీనర్లు, డాక్టర్ ఎస్ఎస్ శాంతకుమారి (డీన్, విఐటి స్కూల్ ఆఫ్ బిజినెస్), డాక్టర్ అమీత్ చవాన్ (డైరెక్టర్, ఐఐఈసీ), కోర్ కమిటీ సభ్యులు, వివిధ విభాగాల ప్రొఫెసర్లు, నంబూరు అనుపమ, సుధా ఎలిసన్ మాతే, సీబీ చక్రవర్తి, అజిత్ జుబిల్సన్, సబీల్ ఎం బషీర్, దీప్ జాయ్ కటువాల్, అనిందితా షోమ్, అరిన్ తివారీ , అరుణ్ కుమార్, శివ కుమార్, ఆర్.సీతాలక్ష్మీ, శామ్యూల్ జాన్సన్, కేఏ అస్రార్ అహ్మద్, మహ్మద్ అబ్దుల్ ముఖీత్ మాజ్, విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీఏ(ఓరియంటల్) చదివేవారికి శుభవార్త

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: బీఏ(ఓరియంటల్) విద్య చదువుతున్న భాషా పండిట్లకు బీఈడీ ప్రవేశ పరీక్ష రాసుకునేలా ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ మేరకు ఉన్నత విద్యామండలి ఉత్తర్వులు జారీజేసింది. పదో తరగతి పూర్తయ్యాక భాషా పండిట్లపై ఆసక్తి ఉన్న వారంతా ఐదేళ్ల కోర్సు బీఏ(ఓరియంటల్)లో ప్రవేశాలు పొందుతారు. అది పూర్తయ్యాక లాంగ్వేజీ పండిట్ ప్రవేశ పరీక్ష(ఎల్‌పీ సెట్) రాసుకుని ఆ తర్వాత తెలుగు, హిందీ, సంస్కృతం తదితర పండిట్ శిక్షణ పొందుతారు. అనంతరం టెట్‌లో అర్హత సాధించి, ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసే డీఎస్సీ రాస్తారు. రాష్ట్రంలో క్రమేపీ భాషా పండిట్ పోస్టులు కుదించుకుపోవడంతో డీఎస్సీలో ఒక్క లాంగ్వేజీ పోస్టులు మినహా మిగిలిన పోస్టు లకు బీఏ అభ్యర్థులకు అవకాశం లేకుండా పోతోంది. దీనిపై సీఎం జగన్ ప్రభుత్వానికి ఇప్పటికే చాలా సార్లు బీఏ(ఓరియంటల్) అభ్యర్థులు, ఆంధ్ర సారస్వత పరిషత్ ప్రతినిధులు వినతిపత్రాలు అందజేశారు. దీంతో బీఏ(ఓరియంటల్) అభ్యర్థులు అదనంగా బీఈడీ(సోషల్ స్టడీస్ మెథాడాలజీ) రాసుకునేలా అనుమతిచ్చింది. దీనికి అర్హత ఉన్న అభ్యర్థుల కోసం ఏపీ ఎడ్‌సెట్ దరఖాస్తుల గడువును మే 15వరకు పొడిగించింది. జూన్ మూడో వారంలో ఈ పరీక్ష నిర్వహకు ఏర్పాటు చేస్తున్నారు. సానుకూలంగా స్పందించిన సీఎం వైఎస్ జగన్, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి, పాఠశాల విద్య కమిషనర్ సురేష్‌కుమార్, ఏపీ ఎడ్‌సెట్ కన్వీనర్ సుధీర్‌రెడ్డికి ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షులు డాక్టర్ గజల్ శ్రీనివాస్ ధన్యవాదాలు తెలిపారు.

పిల్లలకు ఏర్పాట్లేవి?

రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ ఆగ్రహం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: సింహాచలం అప్పన్న చందనోత్సంలో బాలల హక్కుల పరిరక్షణలో భాగంగా సంపూర్ణ సదు పాయాలు కల్పించడంలో అధికారులు పూర్తిగా వైఫల్యం చెందారని దీనిపై నివేదిక సమర్పిం చాలని ఆదేశాలు జారీ చేస్తున్నట్టు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్ పర్సన్ కేసలి అప్పారావు, సభ్యులు గొండు సీతారాంలు చెప్పారు. ఈ మేరకు ఆదివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. పిల్లల కోసం ప్రణాళిక బద్ధంగా ఏర్పాట్లు చేయటంలో వైఫల్యం చెందారని తెలిపారు. దేవాలయ పరిసర ప్రాంతాలలో క్యూలో పసిపిల్లలు, బాలలుతో నిలబడి వేచివున్న వారికి మంచి నీరు, మొదలైన కనీస సదుపాయాలు కల్పించక పోవడం బాధాకరమని తెలిపారు. పసి పిల్లలు, బాలలు 3నుండి 5 గంటలు వేచి ఉన్నా రని ఆకలి కేకలు, ఆర్తనాదాలతో ఇబ్బందికర పరిస్థితులు తలెత్తడం విచారకరమని తెలిపారు. స్త్రీ,శిశు సంక్షేమ శాఖ సిబ్బంది సేవలు, చైల్డ్ లైన్ సేవలు వినియోగించుకోలేకపోవడాన్ని కమిషన్ తీవ్రంగా పరిగణిస్తుందన్నారు. వారం రోజులు ముందుగానే సంబంధిత పరిపాలనా అధికారులు, ఉన్నతాధికారులు, సిబ్బందితో బాలల కోసం చేయాల్సిన ఏర్పాట్లపై ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సమీక్ష సమావేశం నిర్వహించి స్పష్టమైన ఆదేశాలు కూడా జారీచేసినప్పటికీ అధికారులు పెడ చెవిన పెట్టడం బాధాకరంగా ఉందని తెలిపారు. అధికారులు అందించే నివేదిక ఆధారంగా సంబంధిత అధికారులపై చర్యలకు రాష్ట్ర ప్రభుత్వానికి తమ కమిషన్ తరపున సిఫారసులు చేయనున్నామని తెలిపారు.

ఉగాది పురస్కారాల ప్రకటన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తెలుగు, సంస్కృత అకాడమీ-2023 సంవత్సరానికి ఉగాది పురస్కారాలను ప్రకటించింది. వివిధ కేటగిరీలకు మొత్తం ఏడుగుర్ని అవార్డులకు ఎంపిక చేసింది. విద్యా,శాస్త్ర సాంకేతిక రంగం నుంచి పి.గోపీకృష్ణ, వైద్యరంగం-డాక్టర్ ఆళ్ల గోపాలకృష్ణ గోఖలే, లలిత కళలు-పసుమర్తి పావని, జానపదం, నాటక రంగం-కురటి సత్యంనాయుడును ఎంపిక చేసింది. వ్యవసాయ రంగం నుంచి వి.గోపీచంద్, సేవా రంగం-మాదిరెడ్డి కొండారెడ్డి, ప్రత్యేక కేటగిరి (చిత్రకళ)- ఆర్.సుభాశ్‌బాబును ఎంపిక చేసింది. అవార్డుకు ఎంపికైన వారికి ఈ నెల 25న ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలో అవార్డులను ప్రదానం చేస్తారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర హోం మంత్రి తానేటి వనతి, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగు నాగార్జున, మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య(నాని) హాజరవుతారు.

కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తాం

టీడీపీ యువ నేత నారా లోకేశ్

విశాలాంధ్ర-ఆదోని: టీడీపీ అధికారంలోకి రాగానే కర్నూలు జిల్లాలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని టీడీపీ యువ నేత లోకేశ్ హామీ ఇచ్చారు. ఆదివారం కర్నూలు జిల్లా ఆదోని నియోజకవర్గంలో మూడవ రోజు యువగళం పాదయాత్ర కొనసాగింది. న్యాయవాదులతో భేటీ అనంతరం లోకేశ్ మాట్లాడుతూ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ హైకోర్టు విశాఖలో అంటాడని, జగన్ రాయలసీమలోనే హైకోర్టు అని మభ్యపెడుతున్నాడని, వైసీపీ ప్రభుత్వం అమరావతిలోనే హైకోర్టు ఉంటుందని సుప్రీం కోర్టులో అఫిడవిట్ దాఖలు చేసిందని తెలిపారు. జగన్ మాదిరిగా కర్నూలులో ఒక మాట చెప్పి, దిల్లీలో మరోమాట చెప్పే దుర్మార్గపు ఆలోచన తనకు లేదని, నాలుగేళ్లుగా మాయమాటలు చెబుతున్న జగన్ కర్నూలులో కనీసం స్థలం కేటాయించి, ఒక్క ఇటుక పెట్టాడా? జగన్ చెప్పే అబద్ధాలు తియ్యగా, మేం చెప్పే నిజాలు చేదుగా ఉంటాయన్నారు. విజ్ఞులైన న్యాయవాదులు నిజానిజాలను గుర్తించాలని, కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని టీడీపీ నిర్ణయం తీసుకుందని తెలిపారు. అధికారంలోకి వచ్చాక ఏర్పాటు చేస్తామన్నారు. పరిపాలన అంతా ఒకచోట ఉండాలని, అభివృద్ధి వికేంద్రీకరణ జరగాలన్నది తమ విధానమని అన్నారు. న్యాయ విభాగానికి సరైన నిధులు, మౌలిక వసతులు కల్పించకుండా కేసులు పెండింగ్‌లో ఉన్నాయని నిందించడం సబబు కాదన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే నిధులు ఎక్కువగా కేటాయించి, మౌలిక వసతులు మెరుగుపరుస్తామని చెప్పారు. మీ వల్లే రాష్ట్రంలో జగన్ చేసిన అరాచకాలను కొంతవరకైనా అడ్డుకోగలిగామని, జూనియర్ న్యాయవాదులకు స్టయిఫండ్ ఇస్తామని, న్యాయవాదుల సమస్యలను పరిష్కరించి ఆదుకుంటామని లోకేశ్ హామీ ఇచ్చారు. పాదయాత్రలో భాగంగా బీసీ సామాజిక వర్గంతో మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీలకు స్వర్ణయుగం చేస్తామని, స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించింది టీడీపీనే అని అన్నారు. జగన్ రెడ్డి బీసీలకు వెన్నుపోటు పొడిచాడని ఆరోపించారు. వాల్మీకి ఫెడరేషన్ ఏర్పాటు చేసి రూ.200 కోట్లు నిధులు ఇచ్చిన ఘనత టీడీపీకే దక్కిందన్నారు. తమ పార్టీ అధికారంలోకి రాగానే ఇస్లామిక్ బ్యాంక్ ఏర్పాటు చేసి మైనార్టీలను ఆదుకుంటామని, రాజకీయ అవకాశాలు కల్పిస్తామన్నారు. నేను మాట్లాడిన మాటలను వక్రీకరించి మంత్రి ఆదిమూలపు సురేశ్ షర్టు విప్పి చంద్రబాబు కాన్వాయ్‌పై రాళ్లు వేయించారని, దళితుల పట్ల చిత్తశుద్ధి ఉంటే జగన్ రెడ్డిని ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. విదేశీ విద్యకు అంబేద్కర్ పేరు తొలగించి జగన్ పేరు పెట్టుకునేటప్పుడు మంత్రి సురేశ్ ఎక్కడున్నారని ఎద్దేవా చేశారు. జగన్ చంచల్‌గూడ జైలుకి బ్రాండ్ అంబాసిడర్ అని, ఒక బాబాయ్‌ని అరెస్ట్ చేసిన కేసులో ఇంకో బాబాయ్ చంచల్‌గూడ జైలుకు వెళ్లారని విమర్శించారు. రాయలసీమ ప్రాంతాన్ని హార్టికల్చర్ హబ్‌గా మార్చే బాధ్యత మాదేనని అన్నారు. పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి వ్యవసాయ రంగానికి సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. రాయలసీమ దాటేలోపు రాయలసీమ అభివృద్ధిపై బ్లూ ప్రింట్ విడుదల చేస్తామని లోకేశ్ తెలిపారు. ఈ పాదయాత్రలో టీడీపీ ఎమ్మెల్సీ, శాసనమండలిలో ఉప నాయకుడు బి.టి.నాయుడు, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ భాస్కర్ రెడ్డి, మాన్వి దేవేంద్రప్ప, సౌదీ రవూఫ్, గుడిసె కృష్ణమ్మ, బసాపురం రామస్వామి, కర్నూలు పార్లమెంట్ మైనార్టీ నాయకులు అఫ్సర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరిన మునగపాటి

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: మంగళగిరి శివాలయం ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్, ఆంధ్ర ప్రదేశ్ పద్మశాలీయ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్, వైసీపీ నాయకుడు డాక్టర్ మునగపాటి వెంకటేశ్వరరావు యువ నేత లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరారు. ఆదోని నియోజకర్గం కుప్పగల్లు శివార్లలో భోజన విరామ సమయంలో డాక్టర్ మునగపాటి యువనేతను కలవగా పసుపు కండువా కప్పి మునగపాటిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. మునగపాటితో పాటు ఆయన కుమారుడు చినరాజా, సోదరుడు రమేష్ కూడా పార్టీలో చేరారు. మంగళగిరి ఇందిరనగర్‌కు చెందిన మునగపాటి వెంకటేశ్వరరావు 2009లో మంగళగిరి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేశారు. 2014-19 మధ్య మంగళగిరి మున్సిపాలిటీ కౌన్సిలర్‌గా పని చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ముఖ్య నేతలు నిమ్మల రామానాయుడు, అమర్‌నాథ్ రెడ్డి, ధూళిపాళ నరేంద్రకుమార్, టీడీపీ మంగళగిరి నియోజకవర్గ వ్యవహారాల సమన్వయకర్త నందం అబద్దయ్య, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకి దేవి, పార్టీ పట్టణ అధ్యక్షులు దామర్ల రాజు, టీడీపీ నాయకులు గుత్తికొండ ధనుంజయరావు, రంగిశెట్టి నరేంద్ర (బాబీ), గోవాడ దుర్గారావు, కారంపూడి అంకమ్మరావు, పడవల మహేష్, కనికళ్ల చిరంజీవి, వాకా మంగారావు, కందుల నాగార్జున, బోగి వినోద్, అన్నం నాగబాబు, జొన్నాదుల రామాంజనేయులు, కొత్తపల్లి శ్రీనివాసరావు, సుఖమంచి గిరి, గోసాల రాఘవ, బుదాటి శ్రీనివాసరావు, తోట గౌరి శంకర్, అవ్వారు వంశీ, తమ్మిశెట్టి హరికృష్ణ, కోగంటి బాబీ, దాసరి సునీల్, తాటి అవినాష్ తదితరులు ఉన్నారు.

అంతర్రాష్ట్ర నేరస్థుడి అరెస్టు

విశాలాంధ్ర-నంద్యాల: జాతీయ రహదారిపై వెళ్తున్న కంటైనర్లలో దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర కంజర్భట్ ముఠా సభ్యుడిని అరెస్ట్ చేసి అతని వద్ద నుండి చోరీ సొమ్ము, వాహనం స్వాధీనం చేసుకున్నట్లు నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి తెలిపారు. కర్నూల్ రేంజ్ డీఐజీ సెంథిల్ కుమార్ పర్యవేక్షణలో రఘు వీరారెడ్డి, అడిషనల్ ఎస్పీ రమణ ఆదేశాల మేరకు డోన్ ఎస్డీపీఓ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో కేసు పరిశీలించామని తెలిపారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం షాజాపూర్ జిల్లాకు చెందిన సంజయ్ పడిహార్ ఫిబ్రవరి 21న హైదరాబాద్ నుంచి బెంగళూ రుకు వెళ్తున్న కంటైనర్ వెనుక భాగం సీల్ కట్ చేసి అందులో నుంచి 17 మల్బారో సిగరెట్ బాక్స్‌లను, సిల్వర్ మాక్స్ కంపెనీకి చెందిన షేవింగ్ బ్లేడ్ బాక్స్‌లు 65 దొంగిలించాడని తెలిపారు. ఈ రెండు కేసులు కూడా ప్యాపిలి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగాయని తెలిపారు. తమకు అందిన కచ్చితమైన సమాచారం మేరకు సిబ్బంది షాజాపూర్ జిల్లాకు చేరుకొని కాపు కాసి నిందితుడిని అరెస్టు చేసి సుమారు 2,96,000 రూపాయల విలువగల 20 బ్లేడ్ బాక్స్‌లను, నేరానికి ఉపయోగించిన క్రేటా కారును స్వాధీనపరచుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ కేసును శోధించిన నంద్యాల సీసీఎస్ సీఐ పి. రామకృష్ణ, ప్యాపిలి సిఐ శ్రీరాములు, ఎస్ఐ శ్రీనివాసులు , ప్యాపిలి ఎస్ఐ రాకేష్ తదితరులను ఎస్పీ అభినందించారు.

ప్రజాస్వామ్యానికి బీజేపీ పాతర

- రాహుల్‌పై అనర్హత వేటుతో కక్ష సాధింపు
- నేడు జై భారత్ సత్యాగ్రహ భారీ బహిరంగ సభ : రుద్రరాజు



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: దేశంలో ప్రజాస్వామ్యానికి, లౌకిక వాదానికి బీజేపీ పాతరేసిందని, ప్రశ్నించినందుకు రాహుల్‌పై అనర్హత వేటుతో కక్ష సాధింపు చర్యలకు మోదీ ప్రభుత్వం పాల్పడుతోందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజు విమర్శించారు. విజయవాడలోని ఆంధ్రరత్నభవన్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఆదానీ అవినీతి, అక్రమాలపై జేపీసీ వేయాలని డిమాండ్ చేశారు. స్వాతంత్ర్యోద్యమంలో కాంగ్రెస్ ప్రధాన భూమికి పోషించిందని, దేశ లౌకిక వాదం, రాజ్యాంగ పరిరక్షణకు కృషి చేసిందన్నారు. గాంధీ, నెహ్రూ, ఇందిరాగాంధీ కుటుంబాల త్యాగాలతో దేశాభివృద్ధి జరిగిందని వివరించారు. ప్రధాని నెహ్రూ హయాం నుంచి రాజీవ్ గాంధీ వరకు దేశంలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయన్నారు. నాడు సాగునీటి రంగానికి నెహ్రూ ఎంతో కృషి చేశారని, సాంకేతిక విప్లవానికి రాజీవ్ గాంధీ కృషి చేశారన్నారు. బీజేపీ ప్రభుత్వం దేశాన్ని పాలించడంలో పూర్తిగా విఫలమైందని, అదానీ అక్రమాలపై తక్షణం జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) వేయాలని, లేకపోతే ఖబడ్దార్ అని హెచ్చరించారు. మహిళలపై అత్యాచారాలు, శాంతి భద్రతలు, ముస్లిం మైనార్టీ వర్గాలపైన, పాస్టర్లపైన దాడులు తీవ్రమయ్యాయని, ఇది ఆపకపోతే తగిన మూల్యం చెల్లించాల్సి ఉంటుందని రుద్రరాజు హెచ్చరించారు. రాహుల్ విషయంలో అనవసర రాద్ధాంతం చేసి సస్పెన్షన్ వేటు వేయడమే కాకుండా క్వార్టరును ఖాళీ చేయమని ఆదేశించడంపై విచారం వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల్ని నిరసిస్తూ ఈనెల 24వ తేదీ సోమవారం జింఖానా గ్రౌండ్‌లో తలపెట్టిన బహిరంగ సభకు రాష్ట్రం నుంచి వేలాదిమంది నాయకులు, కార్యకర్తలు తరలి వస్తున్నారని, జాతీయ స్థాయి నాయకులు పాల్గొంటున్నారని చెప్పారు. ఈ బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు షేక్ మస్తాన్ వలి, సుంకర పద్మశ్రీ, పి.రాకేష్‌రెడ్డి, విజయవాడ నగర అధ్యక్షులు నరహరశెట్టి నరసింహారావు, మీసాల రాజేశ్వరరావు పాల్గొన్నారు.

ఉద్యోగులకు ప్రయోజనాల కల్పన

ఏపీ రెవెన్యూ జేఏసీ చైర్మన్ దివాకర్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఉద్యోగులకు చాలా ప్రయోజనాలు చేకూర్చిందని ఏపీ రెవెన్యూ జేఏసీ చైర్మన్ వీఎస్ దివాకర్ స్పష్టం చేశారు. తాడేపల్లిలోని పూజిత కాన్ఫరెన్స్ హాల్‌లో వీఎస్ దివాకర్ అధ్యక్షతన ఏపీ రెవెన్యూ, జేఏసీ సభ్య సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, ఇతర కార్యవర్గంతో సమీక్ష నిర్వహించారు. దివాకర్ మాట్లాడుతూ ఏపీ జేఏసీ అమరావతి చేపడుతున్న ఉద్యమంలో తాము భాగస్వాములం కావడం లేదన్నారు. ఉద్యోగులకు ఇంకా ప్రయోజనాలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, త్వరలోనే అవి నెరవేరుతాయని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు వైఎస్ఆర్ ప్రభుత్వం రాగానే ఒక ప్రభుత్వరంగ కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రతి నెల ఒకటో తేదీన జీతాలు చెల్లిస్తున్నారని, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులందరిని రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. రెవెన్యూ శాఖలో అన్ని తరగతులు ఉద్యోగులకు డిప్యూటీ కలెక్టర్ల వరకు పదోన్నతులు కల్పించారని చెప్పారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా సుమారు లక్ష అరవై వేల పైబడి ఉద్యోగాలు కల్పించి ప్రొబేషన్‌ను డిక్లేర్ చేసి శాశ్వత ఉద్యోగులుగా ప్రభుత్వం గుర్తించిందన్నారు. ఏపీ వీఆర్‌ఏ అసిస్టెంట్ల రాష్ట్ర అధ్యక్షులు జి.ధైర్యం, ఏపీ రెవెన్యూ కంప్యూటర్ ఆపరేటర్ల రాష్ట్ర అధ్యక్షులు జే.సూరిబాబు, ఏపీ వీఆర్‌ఏ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పి.జోసెఫ్, ఏపీ సర్వేయర్ల అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ డి.సాయిబాబు, ఏపీ వీఆర్‌ఏ అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరి సత్యరాజు, రాష్ట్ర నలుమూలల నుంచి వివిధ సంఘాల అధ్యక్షులు కార్యదర్శులు పాల్గొన్నారు.

జాషువ కవితాదర్శనం

సాహితి

మహాకవి, సామాజిక విప్లవమూర్తి జాషువా మహాకవి హేతువాద సాహిత్యం సృష్టికర్తల్లో ముఖ్యుడు. ఆయన కవిత్వంలో హేతువాదం ఎల్లెడల ప్రభాశిస్తుంది. జాషువా బ్రాహ్మణవాద భావజాల వ్యతిరేక కవి. ఆయన మీద అంబేద్కర్ ప్రభావం వుంది. హిందూ బ్రాహ్మణ వాదానికి వ్యతిరేకంగా ఆధునిక యుగంలో జాషువా బలంగా ఎలుగెత్తాడు. తరతరాలుగా వస్తున్న వారసత్వాన్ని కొనసాగించాడు.

"ఒకడు రుద్రాక్షమాలికలు నెత్తిన జుట్టి
శివమూర్తియై భూమికవతరించు
ఒకడూర్ధ్వ పుండ్రంబు లురువుగా దగిలించి
శివలింగమును జూచి చీదరించు
ఒకడు రెండును గాని వికటవేషము దాల్చి
పై వారి మీద సవాలు సేయు
ఒకడు గంజాయిదమ్ముకు దాసుడైపోయి
బూడిదగురవడై పుట్టివచ్చు
మనుజులారమాది ఘనమైన మతమని
ఒకడు తరిమి తరిమి యుగ్గడించు
పెక్కు మతములిట్లు పేచీలు సాగింప
మార్గమేది యైక మత్యమునకు."

ఒకే హిందూ మతంలో వచ్చిన వివిధ శాఖలు ఎలా మారణహోమాన్ని సంఘంలో అనైక్యతను సృష్టిస్తున్నాయో జాషువా బలంగా తెలిపాడు.

హిందూ మతంలో ఐక్యతను భగ్నం చేసే కుటిల తత్వముంది. మానవత్వాన్ని విచ్ఛిన్నం చేసే అన్ని మాలిన్యాలతో హిందూమతం రూపొందింది. ఆహార్యంలో విహారంలో జీవన విధానంలో మనుష్యలందరిని విభజించే జీవన సూత్రం హిందూ మతంలో వుంది. ప్రపంచంలో ఏ మతములో నైనా మానవత్వం ఏ కొంతో దాగివుంటుంది కాని మానవతాంశమే ఇసుమంత లేనిది హిందూ మతం. అందుకే అంబేద్కర్ భారతదేశంలో "మత తత్వమంటే హిందూ మత మౌఢ్యమే" అని వ్యాఖ్యానించాడు. హిందూమతం ఎందరో కళా జీవులను అవమానపరిచింది. వారి గుండెల్ని గాయపరిచింది. హిందూమతంలోనే జీవించకూడదు అన్న నిర్ణయానికి వారిని తీసుకువచ్చింది.

"పుట్టగావలె సత్క వీశ్వరుడు నీ పుణ్యానమా వంశపు బుట్ట జీలిచి కొంచు సంచిత కళాపూర్ణ ప్రభారాశియై పుట్టం గూడదు పుట్టినంగలుగవచ్చున్ నిండుసన్మానముల్ గట్టా యుచ్చత నీచతాయుత వితర్క భ్రష్ట దేశంబునన్"

గుండె గేయాల నుండి హేతువాదం

జాషువా గుండెకు ఎంత గాయం కాకుంటే 'వితర్క భ్రష్టదేశంబున' అంటాడు. ఇలా కవుల గుండెలు అందునా బ్రాహ్మణేతర కవుల గుండెలు అనేకసార్లు హిందూమత దౌష్ట్యానికి బద్దలయ్యాయి. హిందూ మతంలోని సాంఘిక అసమానతలను గూర్చి క్రీ.శ.1030లో భారతదేశాన్ని దర్శించిన ఆల్బెరూని రాసిన అంశాలను డా॥ బి.ఆర్.అంబేద్కర్ తన రచనల్లో ఇలా పేర్కొన్నారు. "హిందువులు తమ కులాలను వర్ణాలుగా పిలిచేవారు. వంశం క్రమం దృష్ట్యా వీటిని పుట్టుకతో వచ్చిన జాతకాలుగా భావించవచ్చు. హిందువులలోని నాల్గు వర్ణాలకు చెందిన ప్రతివ్యక్తికి ప్రత్యేకంగా

గుర్తించదగిన కులం ఆపాదించారు. తన ఇంట్లోనే వుండి పని చూచుకొనే వారిని బ్రాహ్మణులు అంటారు. వీరిలో రోజు ఒక అగ్నిపూజ చేస్తు వుండే వారిని ఇస్తి అని మూడు అగ్నిహోత్రులకు చేసేవారిని అగ్నిహోత్రులని అగ్నికి పూజతో పాటు బలులు అర్పించేవారిని దీక్షితులని అంటారు. ఇలా హిందూ సమాజం ఒకే వర్ణంలో వివిధ నామ గోత్రాలు రూపొందించి విద్వేషానికి గురి చేసింది. ఆల్బెరూని తన రచనల్లో క్రీ.శ. 11వ శతాబ్ది నాటికి ఈనాడు శూద్రులుగా చెబుతున్న వృత్తి కులాలు ఆనాడు అస్పృశ్య కులాలుగానే వున్నాయని పేర్కొన్నాడు. వీరందరిని కలిపి అంత్యజులంటారని తెలిపాడు. శూద్రుల కన్నా తక్కువ స్థాయికి చెందిన వారిని అంత్యజులు అంటారని వీరు చేపట్టే వృత్తులను బట్టి గుర్తించటమే గాని వీరిని ఒక కులంగా పరిగణించరు. వీరిలో పరస్పర వివాహ సంబంధాలువున్నా ఎనిమిది వర్గాల (శ్రేణుల) వారున్నారు. చెప్పులు కుట్టేవారు, నేత పనివారు మాత్రం ఇతరులతో కలవడానికి వీలులేదు. ఈ ఎనిమిది శ్రేణులు 1.బట్టలు ఉతికేవారు, 2.చెప్పులు కుట్టేవారు, 3. విచిత్ర విన్యాసాలు చేసేవారు, 4.బుట్టలు అల్లేవారు, 5. పడవలు నడిపేవారు, 6. చేపలు పట్టేవారు, 7. అడవి జంతువులు, పక్షులను వేటాడేవారు, 8. నేతగాళ్ళు. నాలుగు వర్ణాలవారు వీరితో కలిసి ఒకే చోట నివసించరు. అందువల్ల ఈ ఎనిమిది శ్రేణులకు చెందినవారు ఊర్లకు పట్టణాలకు దగ్గరలో తమ నివాసాలను ఏర్పరచుకొంటారు. హాది, దోయ (దొంబ) చండాల, బద్ధతావులని పిలిచేవారు. ఏ ఒక కులానికో శ్రేణికో చెందిన వారుగా గుర్తించరు. వారు సాధారణంగా గ్రామ పారిశుధ్యానికి ఇతర సేవలకు అంకితం అయినవారు. వీరు అందరూ వేరు వేరు వృత్తుల వారైనప్పటికి ఒకే వర్ణంగా పరిగణిస్తారు. శూద్రునికి బ్రాహ్మణ వనిత ద్వారా పుట్టిన సంతానంగా భావించి వీరిని అత్యంత నిమ్న బహిష్కృత కులంగా వ్యవహరిస్తారు. ఈ వివరణను బట్టి వృత్తి కులాలన్ని ఆనాడు అస్పృశ్య కులాలుగా అంత్యజులుగా వ్యవహరించారు.

కుల సమస్య - హేతువాదం

ఆయా చారిత్రక కాలాల్లో కొన్ని వృత్తి కులాలు చాతుర్వర్ణంలోకి చేరిపోయారు. కొన్ని వర్గాలు మాత్రమే అస్పృశ్య కులాలుగా మిగిలిపోయాయి. ప్రధానంగా వీరు అస్పృశ్య కులాలుగా మిగిలి పోవడానికి కారణం. హిందూ సమాజ చట్రంలోకి ఇమడడానికి వీలులేని మాతృస్వామ్య కుల నిర్మూలనా సంస్కృతులు వీరిలో దాగి ఉండటమే. వారి వర్ణతత్వానికి వ్యతిరేకంగా ఎవరు ఆలోచిస్తే వారంతా అంత్యజులని, అవర్ణులని అస్పృశ్యులని హిందూ సమాజం శాసించింది. మనుస్మృతిలో ఈ అంశాలను ధర్మబద్ధం చేసింది. హిందూ రాజవంశాలు ఈ ధర్మాన్ని తూచ తప్పకుండా, ఆచరించాయి. డా॥ బి.ఆర్.అంబేద్కర్ తన పరిశోధనాత్మక గ్రంథాల్లో హిందూ సామాజిక వ్యవస్థలో దాగున్న 'అస్పృశ్య' భావజాలాన్నే తరువాత సమాజం మీద రుద్దారని స్పష్టం చేశారు. జాషువా ఈ అస్పృశ్య సమాజంలో నలిగిపోయిన గుండెల శోధనలను వినిపిస్తే, అంబేద్కర్ వాటి మూలాలను శోధించి వాటికి గల కారణాలను, నివేదించాడు. ఒకరు మహాకవి, ఒకరు సామాజిక శాస్త్రవేత్త, ఇద్దరి ప్రతి స్పందన ఒక్కటే 'హృదయము లేని లోకము సుమీ' ఇది అని జాషువా ఆక్రందిస్తే మానవత్వంలేని హిందూ సమాజం అని అంబేద్కర్ సూత్రీకరించాడు. ఈయన కవితలో సామాజిక శాస్త్రం దాగుంది. ఆయన సామాజిక శాస్త్రంలో కవితా హృదయం ఉంది.

"ఈ ప్రశాంతరాత్రి యెల్ల లోకంబును
బుజ్జగించి నిద్ర బుచ్చుకొని యె
ఔషదంబు లేని యస్పృశ్యతా జాడ్య
మంద భాగ్యు నన్ను మరచి పోయె"

అనే పద్యంలో మరణ వేదనను జాషువా అనుభవించాడు. అంబేద్కరూ అనుభవించాడు. అందుకనే అంబేద్కర్ గురించి జాషువా

"కలడంబేద్కరు నా సహోదరుడు మాకైయష్టకష్టాలకు
బలియై సీమకుపోయి గ్రమ్మరిన విద్వాంసుండు వైస్రాయి మే
ల్కొల్పులందిన దొడ్డవాఁడతడఁడు నీకున్ స్వాగతంబిచ్చి పూ
పుల పూజిల్ వొనరించెనే యతని మెప్పుల్ విజయారంభముల్"

అన్నాడు. ఇందులో సోదరత్వంతో అంబేద్కర్ మాకై అష్టకష్టాలు భరించి బలైనాడని హృదయపూర్వకంగా నివేదించాడు. జాషువా అంబేద్కరులు ఇద్దరు ఒకే శతాబ్దంలో ఆవిర్భవించినవారు. డా॥బి.ఆర్.అంబేద్కర్ 1891లో జన్మిస్తే, జాషువా 1895లో జన్మించాడు. 4 సంవత్సరాలు ఇద్దరికి తేడా. అంబేద్కర్ నాలుగు సంవత్సరములు జాషువా కంటే పెద్దవాడు. అంబేద్కర్ మధ్య భారతంలో మౌ గ్రామములో జనించాడు. జాషువా తెలుగు నేలలో వినుకొండలో జనించాడు. అంబేద్కర్ తల్లిదండ్రులు అస్పృశ్య కులానికి సంబంధించిన మహార్‌లు.

సామాన్యుడి నుండి అసామాన్యుడిగా ఎదిగిన మహాకవి జాషువా. 1895లో వీరయ్య యాదవ, లింగమాంబ మాదిగలకు సెప్టెంబర్ 28న వినుకొండలో జన్మించాడు. తండ్రి క్రైస్తవ మతం తీసుకున్నాడు. అస్పృశ్యత, వివక్షతను, పేదరికాన్ని చిన్నతనం నుండే అడుగడుగునా ఎదుర్కొని ఎదిగిన కవి జాషువా. భార్య పేరు మేరీ. మహాకవి జాషువా తన జీవిత ప్రస్థానాన్ని సత్యనిష్ఠగా సాగించాడు. ఆయన రాసిన కవిత్వం కేవలం భావ కవిత్వమో, ఉద్రేక పరిచేదో, శృంగారభరితమైనదో కాక అట్టడుగు జీవన చైతన్యాన్ని మేల్కొలిపేదిగా ఉండేది. ఆయన కవితా శిల్పం శ్రీనాథుని దగ్గరగా ఉండేది. వారి మధు శ్రానాథుడు అనేవారు. జాషువా గ్రామీణ పదాలకు కావ్య గౌరవం కల్పించిన వాడు. దీపము అనే పదానికి తిర్లిక అనే పదం వాడిన ఘనుడు జాషువా అని బొద్దులూరి నారాయణ రావు చెప్పేవారు. తన జీవితంలో నిత్యం జరిగే అంశాలను తీసుకొని కవిత్వం చేయడంలో దిట్ట జాషువా. మానవ సంబంధాలే కాక జీవనసంబంధాలు కూడా ఆయన కవిత్వంలో ఒక పాఠశాలలా నడిచాయి. జాషువా గారి రచనల్లో కులతత్వ నిరసన అంతటా నడిచింది. ఆయన ప్రతి కదలికలో అసమానతలకు వ్యతిరేకంగా పోరాడుతూనే వచ్చారు. జీవితం ఆయన కవిత్వంలో శిల్పానికి మూలం. జాషువా కవిత్వానికి గానీ, దళిత కవిత్వానికి గానీ ప్రాణం జీవితమే. కవిత్వం ఒక సామాజిక చరిత్రకు నిధి అనేది జాషువా కవిత్వం నిరూపిస్తుంది. జాషువా సామాజిక స్పృహ ఉన్న కవులందరికీ దిక్సూచి. జాషువా కవిత్వంలో, ఔషధ గుణాలున్నాయి. మానవతా దీప్తి ఉంది. మనసులో ఉన్న మాలిన్యాలను కడిగివేసే సంఘ వాదాన్ని జీవితానికి అన్వయించే తత్వం ఉంది.

అందుకే జాషువా కవిత్వం ఒక సామాజిక జీవన పాఠశాల. మానవతా స్పర్శ, తాత్త్విక దృక్పథం వీరి రచనల నిండా కన్పిస్తుంది. చాతుర్వర్ణ, వేయిపడగల సంస్కృతి అంతా కల్పితమేనని చెప్పడం జాషువాది సామాజిక విప్లవ మార్గమే అవుతుంది. కాళిదాసు కవిత్వం కంటే కూడా జాషువా కవిత్వంలో విశిష్టత ఉంది. జాషువాది కులాధిపత్య వ్యతిరేక కవిత. వీరి కవిత్వంలో నిర్భయత్వం, ఆత్మగౌరవం ప్రధానమైనవి. వీరి రచనలలో "గబ్బిలం" విశిష్టమైనది. సామాజిక చరిత్ర అధ్యయనానికి, దళిత చరిత్ర రచనకు గబ్బిలం ఒక ఆకర గ్రంథం. నిజానికి దీన్ని దళిత భారతం అనవచ్చు. 1946లో చెళ్లపిళ్ళ వెంకటశాస్త్రి జాషువకు గండ పెండారం తొడిగి నవయుగ చక్రవర్తి అనే బిరుదు నిచ్చారు. త్రిపురనేని రామస్వామి, కొండవీటి వెంకట కవి, తుమ్మల సీతారామ మూర్తి, విశ్వనాథ సత్యనారాయణ వంటి మహా మహా ఉద్దండ పండితులు వీరిని సన్మానించారు. వీరి కవితా శృతి గొల్లసుద్దులు అయినా అడుగడుగునా అభ్యుదయం, హేతువాదం వీరి రచనల్లో గోచరిస్తాయి. తెలుగు సాహిత్య చరిత్రలో మహాకవి జాషువా మణిపూస. యుగకర్త. ప్రత్యామ్నాయ సాహిత్య దిక్సూచి. హేతువాద దృక్పథ మార్గదర్శి. తెలుగు కవితా లోకంలో జాషువా సాహిత్యం అజరామరం.

డా॥ కత్తి పద్మారావు, 9849741695

సాహితీ సవ్యసాచి శ్రీశ్రీ

కవిత్వంలో బాధితులే ప్రధాన పాత్రధారులని నమ్మిన,
మహాప్రస్థానం, ఖడ్గసృష్టి, సిప్రాలి అంటే
సామాన్య సాహితీ ప్రియుల మస్తిష్కాలకు తట్టేది
మహాకవి, ప్రజాకవి, నవయుగ కవితా యుగపురుషుడు శ్రీశ్రీ.

ఆక్రందనలు, ఆర్తనాదాలు, అన్యాయాలు, ఆవేదనలు
కనిపించేట్లు కవితలలో వినిపించినా,
ఒకేస్థలంలో స్థాణువుగా గాక
పురోభివృద్ధికి పురోగామివి అవమనీ,
'నీతల రాతింతే అన్నవాక్కు కూడా
నీముందు తలదించుకొనేలా చేయగల సత్తా నీదంటూ'
నిరాశాపరుడి తల నిమిరి చెప్పేట్లు,
'కదంతొక్కుతూ, పదంపాడుతూ, హృదాంతరాళాన్ని గర్జింప' చేసే
ప్రగతిశీల, అభ్యదయ భావాల శ్రీశ్రీ

యువ రచయితలకు ఒక రోల్‌మోడల్ అయినా....
సాహితీ వేత్తల సమాగమ సమయాన
సమయోచిత సాహితీ చమత్కారాల శ్లేషలను విసిరినా

'సాధించిన దానికి సంతృప్తిని చెందీ
అదే విజయమనుకుంటే పొరపాటోయీ' అని ప్రభోదించినా....
'ప్రభునెక్కిన పల్లకి కాదోయ్, అది మోసినబోయీలెవ్వర' ని
నిన్ను జాతికి నిలువెత్తు ఆసరాగా వున్నా.....
'సింధూరం, రక్తచందనం, బందూకం, సంధ్యారాగం,
పులి చంపిన లేడినెత్తురు, కలకత్తా కాళిక నాలిక'
అంతా 'అమ్మో' అనుకునే అరుణార్ణవ భావాలే అయినా.....

చెలికన్నులలో దాగిన వెన్నెల సోననుకుంటూ
చకోరమై వరించి, అనుసరించిన ప్రియుడి
రసరమ్య ప్రేమ గీతాలనూ అందించిన,
'ఇవేవీ కవిత్వం కాదంటూ'
'ఓహో మోహన రూపా కేళీ కలాపా' అని కన్నయ్యను కీర్తిస్తూ
'రఘురాముడూ, రమణీయ, వినీల ఘనస్యాము'డనీ
కీర్తించిన సాహితీ సవ్యసాచి శ్రీశ్రీ.

వేదం సూర్యప్రకాశం, సెల్: 9866142006

మహేశ్వరయ్య స్మారక సాహితీ పురస్కారం-2022

సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో ప్రతి ఏటా ఇచ్చే మహేశ్వరయ్య స్మారక సాహిత్య పురస్కారం-2022కు 'కలుంకూరిగుట్ట' కథా సంపుటి ఎంపికైంది. తెలుగు రాష్ట్రాల నుంచి 2022 సంవత్సరంలో ప్రచురించిన 39 కథాసంపుటాలు పరిశీలనకు వచ్చాయి. సంపుటాలలో చిత్తూరు జిల్లాకు చెందిన యువకవి, కథారచయిత కె.వి.మేఘనాథరెడ్డి కథలసంపుటిని న్యాయనిర్ణేతలు ఎంపికచేశారు. తెలుగురాష్ట్రాల నుండి విరివిగా కథా సంపుటాలు వచ్చినందున న్యాయనిర్ణేతలను తెలుగురాష్ట్రాలలోని మూడు ప్రాంతాలు తెలంగాణ, కోస్తాంధ్ర, రాయలసీమల నుండి ఒక్కొక్కరిని ఎంపిక చేసుకుని వారిచ్చిన తుది నివేదిక ఆధారంగా ఈ సంపుటిని అత్యుత్తమ కథాసంపుటిగా ఎంపిక చేయడమైనది. అవార్డు గ్రహీతకు సన్మానంతో పాటు జ్ఞాపిక, ఐదువేల రూపాయల నగదును ఏప్రిల్27న కర్నూలు టీజీవికళాక్షేత్రంలో జరిగే మహేశ్వరయ్య ద్వితీయవర్ధంతిసభలో అందించనున్నాము.

కెంగార మోహన్, అధ్యక్షులు, అవార్డు కమిటీ-2022

రాజాం రచయితల వేదిక 99వ సమావేశం

రాజాం రచయితల వేదిక 99వ సమావేశం ఈ నెల 30 ఆదివారం ఉదయం 9.30 గంటలకు విజయనగరం జిల్లా రాజాంలో గల విద్యానికేతన్ పాఠశాలలో నల్ల రవికుమార్ అధ్యక్షతన జరుగుతుంది. ఆ సభలో 'దీర్ఘ కవిత 1818-పరిశీలన' అనే అంశంపై పిల్లా తిరుపతిరావు ముఖ్య ప్రసంగం చేస్తారు.

గార రంగనాథం, నిర్వాహకుడు, రాజాం రచయితల వేదిక, 98857 58123

గ్రంథ సమీక్ష

సమకాలీన సమస్యలపై శంఖారావం



చాగంటి తులసి కూనలమ్మ పదాలు,
మరికొన్ని వచన కవితలు.
రచన : చాగంటి తులసి
వెల : రు.200/-, పేజీలు : 102
ప్రచురణ : చాసో స్ఫూర్తి ప్రచురణలు.
ప్రతులకు : ముఖ్యమైన అన్ని పుస్తక కేంద్రాలు.
చాగంటి తులసి, పాల్ నగర్,స్ట్రీట్ నం-3,
విజయనగరం-535003,ఆం.ప్ర.
సెల్ నం.7995691171, 9963377672.

వేల్పుల నారాయణ, 9440433475

సమాజం పట్ల, సాహిత్యం పట్ల అపారమైన అనుభవం, పరిశీలనలతో స్పందిస్తూ రాసిన సమకాలీన సమస్యలపై శంఖారావం చాగంటి తులసి గారి కూనలమ్మ పదాలు,మరికొన్ని వచన కవితల సంపుటి. సమస్యలతో సతమతమౌతూ సమాజంలో జీవిస్తున్న మనుషులందరు ఆ సమస్యలపై ఏదో ఒక రూపంలో బాధపడుతూనే ఉన్నారు. కవులు, కవయిత్రులనేవారు కూడా సమాజంలో భాగస్తులే. సమస్యలకు బాధలకు స్పందించకుండా ఉండలేరు. తులసి కూడా సమాజంలోని సమస్యలకు స్పందిస్తూ ప్రజలను మేలుకొల్పాలనే ప్రగతిశీల దృక్పథంతో రాసిన కవితలనేకం ప్రజలనాలోచింప చేస్తాయి. తులసి ప్రముఖ అభ్యుదయ కథా రచయిత చాగంటి సోమయాజులు కూతురుగానే కాకుండా మంచి కథా రచయిత్రిగా, అనువాదకురాలిగా అందరికి తెలుసు. అనేక కథలు రాసి తులసి కథలపేర ప్రచురించారు. హిందీలో డాక్టరేట్ తీసుకొని హిందీ ఉపన్యాసకురాలిగా ఒరిస్సాలో పనిచేశారు. ఒరియా, హిందీ నుండి అనేక గ్రంథాలను తెలుగులోకి అనువదించారు. అదే విధంగా తెలుగు నుండి హిందీలోకి ప్రముఖుల పుస్తకాలను అనువదించారు.

పదవీ విరమణ తరువాత ప్రస్తుతం విజయనగరంలో వుంటున్నారు. అందువల్ల ఆప్రాంత చిత్రణ కూడా ఇందులో కనబడుతుంది. నేను అనే కవితలో తులసి తనేమిటో తన నిబద్ధతను చాటుకుంటూ– "నిరంతర విద్యుత్ ప్రవాహాన్ని/ చీకట్లు కమ్మిన కళ్లకు కాంతిరేఖని..

మానవత్వపు వేవు లెంగ్తుని/ నిత్యం శక్తిని పెంచే చార్జర్‌ని కవిని" అంటారు. ఆమె చెప్పుకున్నట్లుగానే ఈ పుస్తకంలోని కవితలన్నిట్లో విద్యుత్తును ప్రవహింప చేస్తూ చీకటి కళ్లను తెరిపించే కాంతిరేఖలను, మానవత్వపు అలలను చూస్తాము. అదేవిధంగా మరో కవితలో– "తన భావుకత ఎగిరి ఎగరడం రాకముందే/ పురిటికందు ఎర్రబావుట అయ్యింది. అని తనసాహితీ సృజన నేపథ్యం, చెప్పుకున్నారు. అంటే చాసో కూతురుగా ఆ ఇంటిలో చాసో, రోణంకి, నారాయణబాబు లాంటి అభ్యుదయ దిగ్గజాల సాహితీ చర్చల ప్రభావం తనపై చెరగని ముద్ర వేసిందని అనుకోవాలి. ఈ కవితా సంపుటిలో మొదటి భాగంలో కూనలమ్మ పదాలు, రెండవ భాగంలో వచన కవితలున్నాయి. వాటికి అద్దం పట్టే విధంగా అన్వర్ వేసిన రంగు రంగుల కవితా చిత్రాలు చాలా హాస్యస్ఫోరకంగా మనసును ఆకట్టుకుంటాయి.

తులసి కూనలమ్మ పదాలు, ఆరుద్ర కూనలమ్మ పదాలను తలపిస్తాయి. ఐతే ఆరుద్రకన్నా ముందే కూనలమ్మ పదాలు కొన్ని ఉన్నా వాటి రచయిత ఎవరో తెలియకపోవడంతో అవి అంత ప్రాచుర్యంలోకి రాలేదు. ప్రక్రియ, నడక అదే ఐనా వస్తుపరంగా అనేక సమకాలీన సమస్యలను ఇందులో చిత్రీకరించారు. 'కూనలమ్మా' అనే చివరి పదంతో ముగిసే చిన్న చిన్న కూనలమ్మ పదాలు అంత్యప్రాసలతో సరళంగా, మాటల చురకత్తులను మీటుతాయి. ఆరుద్ర తన కూనలమ్మ పదాల్లో శ్రీశ్రీ, కృష్ణశాస్త్రి, బాపులపై కొన్ని కూనలమ్మ పదాలు రాసినట్లే తులసి కూడా శంకరశాస్త్రి (ఆరుద్ర..), రోణంకి, నారాయణబాబు, చాసో, గిడుగు, గురజాడ తదితరులపై రాసిన కూనలమ్మ పదాలు వారి సాహితీ సేవను ప్రస్ఫుటింపజేస్తాయి. అన్న శంకరశాస్త్రి "మజా మాటల మేస్త్రి/ పాతనెత్తిన పిడుగు/ వాడుక భాష గిడుగు/ కవిత మధువుల జల్లు రోణంకికే చెల్లు/ శ్రీ నా బాబుగుండె/ భగత్ మృతికే మండె/ చదువకు గురజాడని/ మరచిపో చాసోని/ తంటాలు ఎందుకని. ఓ కూనలమ్మా అంటూ ఇలా అనేక మంది రచయితలపై రాసి వారి ఔన్నత్యాన్ని కళ్లకుగట్టారు.

అదే విధంగా విజయనగర ప్రాశస్త్యాన్ని వివరిస్తూ– "విజయనగర ఊరు/ మంచి ముత్యపు పేరు/ మహిళ యోచన కోరు ఓకూనలమ్మా..అంటారు. ఆధునిక రాజకీయాలాను, కులమతాల ప్రభావాలను ఎత్తిచూపుతూనే, ఓటుతో గెలిచినవారు, అధికార దాహంతో పార్టీలు మారుతున్న తీరు, పాలకుల పేరుతో పీడకులవుతున్న తీరు అనేకకవితల్లో బట్టబయలు చేస్తున్నారు. "ఓటు ఓటమిచూడ/ పదవి మైకపు పీడ/ వదలదు ముందు చీడ ఓకూనలమ్మ ..అంటూ హెచ్చరిస్తున్నారు. అదే విధంగా– "కులపు పిలుపు స్వీటు/ మతపు మురిపెపు హాటు/ సీటు గెలుపుకు గీటు ఓ కూనలమ్మా అంటూ గెలుపు రాజకీయం పై కులమతాల ప్రభావాన్ని చూపించారు. వస్తూత్పత్తి చేస్తూ కార్పోరేట్లుగా ఎదుగుతున్న అదాని, అంబానీ లాంటి వారు పాలక వర్గాలకు అత్యంత ఆత్మీయులవుతున్న తీరును స్పృశించే విధంగా– "వస్తు ఫేక్టరీ వాడు/ ఫక్తు లాభం గాడు/ దోస్తు కానే కాడు ఓ కూనలమ్మ అలాంటి వారు మిత్రులు కానే కాదని వారి వ్యాపార నైజాన్ని బైట పెట్టారు.

ఆధునిక వైద్యా వ్యాపార తీరును ఎండగడుతూ – "స్కాను టెస్టుల బెదురు/ నకిలీ మందుల అదురు/ కళ్ళ బిల్లుకు చెదురు ఓకూనలమ్మా. టెస్టులు, మందుల పేర బిల్లులు చూస్తే కళ్లు చెదిరి పోతాయని ఇది మన వ్యవస్థ అని చూపిస్తున్నారు. ఇక కవితల భాగంలో అనేక కవితల్లో అనేక సామాజిక వాస్తవ దృశ్యాలను ఎక్స్‌రే తీసి చూపించారు.

అశ్రు జలపాతం అనే కవితలో.. "దేవుడు పదిలం దేవతార్చన పేటికలో/ పదిలం పదిలం ఢిల్లీ సదనంలో రాజ్యాంగ నిలయం

చాచిన చేయి చూపుడువేలు/ స్థిరం స్థిరం సుస్థిరమేనా?" దేవతార్చన పేటికలో లాగా రాజ్యాంగం ఉన్నదని, భవిష్యత్తులో అంబేద్కర్ రాసిన రాజ్యాంగం, అందుకు ప్రతీకగా చూస్తున్న అతడు, అతని చూపుడు వేలు, సుస్థిరంగా ఉంటుందా అనే ఆందోళనను వ్యక్త పరుస్తున్నారు. ఎందుకంటే ఈనాడు రాజ్యంగాన్ని రక్తమాంసాలు లేని అస్తిపంజరంగా తయారు చేసి ప్రజాస్వామ్యం పేర సాగుతున్న నియంతృత్వ పరిపాలన పోకడలను చూస్తుంటే ప్రతిఒక్కరికి ఈ ప్రశ్న రాక మానదు. వజ్రపు తెలుపు అనే కవితలో– "నేను జనమే శ్వాస ధ్యాసా/ నేను జనమే జవం జీవం/అదీ వజ్రపు తెలుపు/ జవ జీవం లేని వర్తమాన వదనం/ వ్యర్థం నిరర్థకం అంటూ జవ జీవం లేని వర్తమాన సామాజిక ముఖచిత్రాన్ని చూపిస్తూ ఇలాంటిది వ్యర్థమని చాటుతున్నారు.

పక పకా నవ్వు కవితలో–
నన్ను చూస్తూ ఎదిగిన నా కూతురువి
తలెత్తుకొని తలెగిరేసె/భయమంటే ఎరుగని బతుకు
నిండా నూరేళ్ల బతికి/ ప్రమాదపు అంచుల్లో పకపక నవ్వు అంటూ
కూతురిని స్త్రీ అస్తిత్వం కోసం నిలబడమంటారు.

అదేవిధంగా ఏంచేస్తావో అనే కవితలో–
"కనడం వరకే నేను తల్లిని/కళ్లు తెరచి లోకం చూశాడు
తన తండ్రికి కొనసాగింపు అయ్యాడు వాడు
మగ మూసలో రూపు పోసుకుంటూ ఉంటే
ఏమి చేయలేని మూగ సాక్షిని నేను.
నారూపంలో నువ్వు వాడి అదిరింపులకు
అధికారాలకు అహంకారానికి
అణిగిమణిగి తలఒగ్గుతావో ఏంచేస్తావో అంటూ ఇంట్లోకి అడుగుపెట్టిన కోడలుకు హితబోధ చేస్తారు. పై రెండు కవితల్లో మహిళల దైన్యస్థితిని కళ్లారా చూపిస్తూ మహిళా ధిక్కార స్వరం వినిపిస్తారు. సంక్రాంతి అనే కవితలో– "ఈ సంక్రాంతి క్రాంతి పథాన/ కాళ్లు సాగని కచ్ఛపం/

కాలానికి కళ్లెం దూరానికి పగ్గం అంటూనే– అంతిమ లక్ష్యం అరుణ పతాకం/ ఊరట ఊపిరి. ఇందులో పరోక్షంగా ప్రగతిశీల వామపక్ష శక్తుల పరిస్థితికి తాబేలు నడకను ప్రతీకగా చూపించినట్లు కనబడుతుంది. ఐనా అడ్డంకులెన్నొచ్చినా సమస్యలకన్నిటికి పరిష్కారం చూపించే అంతిమ లక్ష్యం అరుణ పతాకమేనని నిబద్ధతను చాటిచెప్పారు. ఇంకా అనేక కవితలు మార్పు కోసం మనలను ఆలోచింప చేస్తాయి. అడుగు ముందుకు వేయమని ఉద్బోధ చేస్తాయి. ప్రగతిశీల సాహితీప్రియులందరు చదవాల్సిన మంచి పుస్తకం ఇది.

కర్ణాటకలో బీజేపీ ప్రలోభాలు

- మంత్రి ఫ్యాక్టరీలో ఈసీ అధికారుల సోదాలు
- 28 కిలోల వెండి దీపాలు స్వాధీనం

ముధోళ్: కర్నాటక అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడడంతో ఎలాగైనా తిరిగి విజయం సాధించేందుకు పాలక బీజేపీ ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది. ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రలోభాల పర్వానికి తెరతీసింది. ఓటర్లకు భారీగా డబ్బు, కానుకలు పంపిణీచేసేందుకు కాషాయపార్టీ నాయకులు సమాయత్తమవుతున్నారు. పెద్ద మొత్తంలో కానుకలను సిద్ధం చేస్తున్నారు. ఇందుకు తమ అనుయాయులు, తమ వద్ద పనిచేసే వారిని ఉపయోగించుకుంటున్నారు. ఓటర్లకు పంపిణీచేసేందుకు సిద్ధంగా ఉంచిన 28కిలోల వెండి దీపాలను రాష్ట్ర మంత్రి మురగేశ్ నిరాణికి చెందిన పరిశ్రమ నుంచి ఎన్నికల సంఘం (ఈసీ) అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

బాగలకోట జిల్లా ముధోళ్లో రాష్ట్ర భారీ, మధ్య తరహా పరిశ్రమల మంత్రి మురుగేశ్ నిరాణికి చెందిన నిరాణి చక్కెర పరిశ్రమ సిబ్బంది నివాస సముదాయంపై ఈసీ అధి కారులు నిర్వహించిన దాడిలో 28 కిలోల బరువు కలిగిన వెండి దీపాలు లభించాయి. సి-విజిల్ యాప్ ద్వారా అందిన ఫిర్యాదు మేరకు ఫ్లైయింగ్ స్కాడ్ ఈ దాడులు చేసింది. ఈ సోదాల్లో 21.45 లక్షల విలువైన 963 వెండి దీపాలను స్వాధీనం చేసుకున్నారు. "ఎన్నికలలో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు అక్రమ చెల్లింపులకు సంబంధించి" ఐపీసీ 171హెచ్ సెక్షన్ క్రింద మంత్రిపై కేసు నమోదు చేసినట్టు ముధోళ్ పోలీసు స్టేషన్ పోలీసు అధికారి ఒకరు తెలిపారు.

దీపాలున్న పెట్టెలపై మురుగేశ్ నిరాణి ఫొటో ముద్రించారు. ఓటర్లకు పంచేందుకు ఈ వెండి దీపాలను సిద్ధంగావుంచినట్టు భావిస్తున్నారు. మరోపక్క రాష్ట్రంలో నందిని, అమూల్ బ్రాండ్ల మధ్య వివాదం కొనసాగుతున్న వేళ సీఎం బసవరాజ్ బొమ్మై చేసిన కీలక వ్యాఖ్యలపై విమర్శలు వెల్లువెత్తాయి. అమూల్ మైసూర్ పాక్ తయారు చేయగలదనే అర్థం వచ్చేలా మాట్లాడారు. ఇది పరోక్షంగా రాష్ట్రంలో అమూల్ రాకను అనుమతిస్తున్నట్టేనని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. 'అమూల్ మైసూర్ పాక్ను తయారు చేయగలిగితే, నందిని గుజరాత్ మిఠాయి శ్రీఖండ్ను తయారు చేస్తుంది' అని అన్నారు. దీన్నిబట్టి అమూల్కు రాష్ట్ర ప్రభుత్వం రెడ్ కార్పెట్ పరుస్తున్నట్టు అర్థం అవుతున్నదని, రాష్ట్రంలోని పాడి రైతుల కడుపుకొట్టేలా బొమ్మై సర్కారు పూనుకొన్నదనే విమర్శలు వస్తున్నాయి.

200 కోట్ల నగదు జప్తు

బెంగళూరు: కర్నాటకలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి మార్చి 29 నుంచి అమలులోకి వచ్చినప్పటి నుంచి కర్ణాటకలో 10 లక్షల లీటర్లకు పైగా మద్యం సహా మొత్తం రూ.200 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎన్నికల సంఘం బుధవారం తెలిపింది. స్వాధీనం చేసుకున్న మొత్తం (రూ.204 కోట్లు) నగదు (రూ.77 కోట్లు), మద్యం (రూ.43 కోట్లు), బంగారం, వెండి (రూ.50 కోట్లు), అలాగే ఉచితాలు (రూ.20 కోట్లు), మత్తు పదార్థాలు (రూ.15 కోట్లు) ఉన్నాయని కర్నాటక ప్రధాన ఎన్నికల అధికారి తెలిపారు. జప్తులకు సంబంధించి 1,629 ఎఫ్ఐఆర్ నమోదయ్యాయి. మే 10న అసెంబ్లీ ఎన్నికల ప్రకటనకు ముందు జప్తుల మొత్తం రూ.58 కోట్లు (మార్చి 9 నుంచి మార్చి 27 వరకు)గా ఉంది.

కాంగ్రెస్ హయాంలోనే కర్నాటకలోకి అమూల్

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

బెంగళూరు: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడే గుజరాత్కు చెందిన పాల సహకార సమాఖ్య ప్రవేశించిందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం తెలిపారు. నందిని చంపడానికి అమూల్ను కర్నాటకకు తీసుకువస్తున్నారని చెప్పడం సిగ్గు చేటని అన్నారు. కర్ణాటక మిల్క్ ఫెడరేషన్ (కేఎంఎఫ్) నందిని బ్రాండ్ పేరుతో పాలు, పెరుగు, ఇతర పాల ఉత్పత్తులను విక్రయిస్తుంది. మే 10న కర్నాటక అసెంబ్లీ ఎన్నికలు జరగున్న నేపథ్యంలో విషయాలను తారుమారు చేసి, వక్రీకరించి భావోద్వేగ సమస్యగా మార్చారని ఆమె అన్నారు. 'భారతదేశం విషయాల పథకంలో ప్రతి రాష్ట్రానికి దాని స్వంత పాల సహకార సంఘం ఉంది. కర్నాటక నందిని-గుర్తించని వారెవరు? ఇప్పుడు కూడా నేను వచ్చాను. నా దగ్గర నందిని పాలు, పెరుగు, పేడా కలిగి ఉన్నాను. అయితే ఢిల్లీలో నేను అమూల్ కొంటాను. నేను ఢిల్లీలో కర్నాటకకు (కానీ) ప్రాతినిధ్యం వహిస్తు న్నాను. నందిని అందుబాటులో లేకుంటే పాలు తాగను అని చెప్పడానికి నేను మానసికంగా సన్యాసిని కాదు. నేను ఇప్పటికీ అమూల్ని కొనుగోలు చేస్తున్నాను. అది కర్నాటకకు వ్యతిరేకం కాదు' అని సీతారామన్ అన్నారు. కర్నాటకలో నందిని, పాడి రైతులను బలోపేతం చేయడం ఎప్పుడూ ప్రశ్న కాదని, ఇది కొనసాగుతుందని ఆమె అన్నారు. ఇతర రాష్ట్రాల పాల ఉత్పత్తులు కర్నాటకలో కూడా అందుబాటులో ఉన్నట్లే నందిని కూడా కేరళ, తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వంటి ఇతర రాష్ట్రాల్లో తమ ఉత్పత్తులను విక్రయించినట్లు ఆమె సూచించారు. 'మంచి పోటీని నేను చెబుతాను. అందువల్ల ప్రతి అంశంలోనూ భారతదేశాన్ని బలోపేతం చేయాలనే ఆలోచన ఉంది. అందుకే భారతదేశం ప్రపంచంలోనే అతి పెద్ద పాల ఉత్పత్తిదారుగా అవతరించింది' అని తెలిపారు. కర్నాటకలోని మేధావుల ఫోరమ్తో ఇక్కడ జరిగిన చర్చా కార్యక్రమంలో అమూల్-నందిని వివాదానికి సంబంధిం చిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. 'కర్నాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు అమూల్ ప్రవేశించింది. అదే గౌరవనీయుడైన మాజీ సీఎం ఇప్పుడు అమూల్ ప్రవేశాన్ని ప్రశ్నిస్తున్నారు. ఆయన కాలంలోనే అమూల్ ఉత్తర కర్నాటకలో మార్కెటింగ్ కోసం ప్రవేశించింది. కచ్చితంగా చెప్పాలంటే, ఇది ఎన్నికల సమయం అయినం దున భావోద్వేగ సమస్యగా మారింది' అని సీతారామన్ ఆరోపించారు. కర్నాటక పాల రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఉందని, తొలిసారిగా పాల సేకరణ ధరను పెంచిన ఘనత మాజీ సీఎం బి.ఎస్.యడియూరప్ప ప్రభుత్వానికి దక్కుతుందని అన్నారు. లీటరుకు రూ.2 అదనంగా ఇచ్చారని, ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు కూడా తమ వంతు కృషి చేశాయని తెలిపారు. 'మళ్లీ ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం దానిని రూ.5కి పెంచింది. పాల రైతులకు మద్దతు కొనసాగుతుంది' ఆమె చెప్పారు. రైతులు, పశుపోషణలో నిమగ్నమైన వారికి కేంద్రం అనేక ఇతర సౌకర్యాలను కూడా కల్పిస్తుందని అన్నారు.

కాషాయ పార్టీ నేతలకు బుద్ధి లేదు

బీహార్ బీజేపీ అధ్యక్షుడి వ్యాఖ్యపై నితీశ్

పాట్నా: బీహార్ బీజేపీ అధ్యక్షుడి వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. వచ్చే అసెంబ్లీ, లోక్సభ ఎన్నికల్లో ముఖ్యమంత్రి నితీశ్ కుమార్, ఆయన పార్టీని మట్టికరిపిస్తామని బీహార్ బీజేపీ అధ్యక్షుడు సామ్రాట్ చౌదరి శపథం చేయడంపై నితీశ్ స్పందిస్తూ, కాషాయ పార్టీ నేతలకు బుద్ధి లేదని అన్నారు. జేడీ(యూ) నాయకుడు నితీశ్ కుమార్ తన 'స్వార్థం' కోసం తదుపరి సార్వత్రిక ఎన్నికల్లో దుమ్ము ('మిట్టీ మీ మిలా దేంగే') అవుతాడని చౌదరి చేసిన వ్యాఖ్య గురించి పాత్రికేయులు అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చారు. 'వారు (బీజేపీ) మెదడు లేని (బుద్ధిహీన్) వ్యక్తులు. అతను చెప్పినట్లు చేయమని అతనికి (సామ్రాట్ చౌదరి) చెప్పండి. నా రాజకీయ జీవితంలో ఎప్పుడూ ఇలాంటి పదాలు వాడలేదు. సున్నితమైన రాజకీయ నాయకులెవరూ ఇలాంటి పదాలు వాడరు. నేను అతల్ బిహారీ వాజ్పేయితో కూడా పని చేశాను. ఆయనంటే నాకు చాలా గౌరవం' అని అన్నారు. శనివారం ఇక్కడ జరిగిన ఓ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు చౌదరి మాట్లాడుతూ తన ప్రధాన మంత్రి ఆశయాలను కొనసాగించేందుకు నితీశ్ కుమార్ బీజేపీకి వెన్నుపోటు పొడిచారని, ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్తో చేతులు కలిపారని అన్నారు. 'బీజేపీ సాయంతో నితీశ్ కుమార్ ఐదుసార్లు ముఖ్యమంత్రి అయ్యారు. ఇప్పుడు జేడీ(యూ) మట్టి కరుస్తుంది' అని అన్నారు. నితీశ్ 2022 ఆగస్టులో బీజేపీని పారద్రోలి ఆర్జేడీ, కాంగ్రెస్, ఇతర పార్టీలతో కలిసి 'మహాఘట్బంధన్' ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. '2024 లోక్సభ ఎన్నికలకు ముందు బీజేపీకి వ్యతిరేకంగా ప్రతిపక్ష పార్టీల కూటమిని ఏర్పాటు చేయడానికి తన ప్రయత్నాలపై నితీశ్ మాట్లాడుతూ 'మేము బీజేపీకి వ్యతిరేకంగా దేశంలో మరిన్ని పార్టీలను ఏకం చేయడానికి ప్రయత్నిస్తున్నాము. అందరం కలిసికట్టుగా కృషి చేస్తాం' అని తెలిపారు. 'నేను ఇటీవల న్యూఢిల్లీలో అనేక మంది ప్రతిపక్ష నేతలను కలిశాను. సార్వత్రిక ఎన్నికలకు ముందు బీజేపీకి వ్యతిరేకంగా ప్రతిపక్షాలను ఏకం చేయడమే నా లక్ష్యం' అని అన్నారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీని కలిసే ప్రణాళిక గురించి అడిగినప్పుడు 'నేను ఆమెను ఎప్పుడు కలిసినా, మీకు తెలియజేస్తాను' అని నితీశ్ తెలిపారు. ఇటీవల ఢిల్లీ పర్యటనలో నితీశ్, ఆయన డిప్యూటీ తేజస్వి యాదవ్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖడ్గే, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీని కలిశారు. దీంతో పాటు ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్తో పాటు అనేక మంది ప్రతిపక్ష నేతలను ఆయన కలిశారు. తనకు ప్రధాని పదవిపై ఆశలు లేవని నితీశ్ ఇప్పటికే స్పష్టం చేశారు. గతంలో అనేక సందర్భాల్లో కేంద్రంలోని అధికార ఎన్డీఏకు వ్యతిరేకంగా ప్రతిపక్ష ఐక్యతను ఏర్పరచడంలో 'సానుకూల' పాత్ర పోషించాలని తాను ఎదురుచూస్తున్నానని నితీశ్ చెప్పారు.

షిండే సర్కార్ పతనం ఖాయం

- 15-20 రోజుల్లో ప్రభుత్వం కూలిపోతుంది
- శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్

జల్గావ్: ఏక్నాథ్ షిండే నేతృత్వంలోని మహారాష్ట్ర ప్రభుత్వానికి 'డెత్ వారెంట్' జారీ అయిందని, మరో 15-20 రోజుల్లో కూలిపోతుందని శివసేన (యూబీటీ) నాయకుడు, రాజ్యసభ ఎంపీ సంజయ్ రౌత్ అన్నారు. ఆదివారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఆదేశాల కోసం తమ పార్టీ ఎదురు చూస్తోందని, న్యాయం జరుగుతుం దని ఆశిస్తున్నామని తెలిపారు. థాకరే నాయకత్వంపై తిరుగుబాటు చేసిన 16 మంది శివసేన ఎమ్మెల్యేలపై (షిండే పార్టీకి చెందిన) అనర్హత వేటు వేయాలని కోరుతూ దాఖలయిన పిటిషన్లపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును సంజయ్ రౌత్ ప్రస్తావించారు. 'ప్రస్తుత ముఖ్య మంత్రి, ఆయన 40 మంది ఎమ్మెల్యేల ప్రభుత్వం 15-20 రోజుల్లో కూలిపోతుంది. ఈ ప్రభుత్వానికి డెత్ వారెంట్ జారీ అయింది. దానిపై ఎవరు సంతకం చేయాలనేది ఇప్పుడే నిర్ణయించాలి' అని ఆయన అన్నారు. కాగా.. ఫిబ్రవరిలోనే షిండే ప్రభుత్వం కూలిపోతుందని రౌత్ గతంలో చెప్పారు. గత ఏడాది జూన్లో ఏక్నాథ్ షిండే... 39 మంది ఎమ్మెల్యేలు ఉద్ధవ్ థాకరే నేతృత్వంలో ఉన్న శివసేన నాయకత్వంపై తిరుగుబాటు చేశారు. ఫలితంగా పార్టీ చీలిపోయింది. థాకరే నేతృత్వంలోని మహా వికాస్ అఘాడి ప్రభుత్వం (ఇందులో ఎన్సీపీ, కాంగ్రెస్ కూడా ఉన్నాయి) కూలిపోయింది. ఆ తర్వాత షిండే బీజేపీతో పొత్తు పెట్టుకొని మహారాష్ట్రలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. 2022 జూన్ 30న షిండే సీఎంగా, బీజేపీకి చెందిన దేవేంద్ర ఫడ్నవీస్ డిప్యూటీ సీఎంగా ప్రమాణ స్వీకారం చేశారు. కాగా, రాష్ట్రంలో గత ఏడాది రాజకీయ సంక్షోభానికి సంబంధించి ఉద్ధవ్ థాకరే, ముఖ్యమంత్రి ఏక్నాథ్ షిండే వర్గాలు దాఖలు చేసిన క్రాస్ పిటిషన్లపై సుప్రీం కోర్టు గత నెలలో తీర్పును రిజర్వ్ చేసింది. ఇది త్వరలోనే వెలువడే అవకాశం ఉంది.

నా డిమాండ్ దృఢంగా ఉంది

- బీజేపీ అవినీతిపై చర్యలు తీసుకోవాల్సిందే
- రాజస్థాన్ మాజీ ఉప ముఖ్యమంత్రి సచిన్ పైలట్

జైపూర్: గత బీజేపీ ప్రభుత్వంలో చోటుచేసుకున్న అవినీతిపై చర్యల కోసం తన సొంత ప్రభుత్వంపై ఆందోళనను కొనసాగిస్తానని మాజీ ఉప ముఖ్యమంత్రి సచిన్ పైలట్ ఆదివారం స్పష్టం చేశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తాను తీసుకున్న వైఖరి నుంచి తాను వెనక్కి తగ్గడం లేదని, గత ప్రభుత్వం అవినీతి కేసుల్లో చర్యలు తీసుకోవాలని 'మర్యాదపూర్వకంగా' అభ్యర్థిస్తున్నానని పైలట్ చెప్పారు, 'నిజం మాట్లాడడం, అవినీతి, అన్యాయానికి వ్యతిరేకంగా గళం విప్పడం కాంగ్రెస్ పార్టీ విలువల్లో ఒకటి. ఈ విలువలను అనుసరించి, నేను ఏప్రిల్ 11న ఒకరోజు నిరాహారదీక్షను పాటించాను. నేటికి రెండు వారాలు అవుతున్నా, ఇప్పటి వరకు ఎలాంటి చర్య తీసుకోలేదు. అందువల్ల, మేము ప్రజలకు చేసిన వాగ్దానాలను నెరవేర్చాలని నేను మళ్లీ మర్యాదపూర్వకంగా ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్నాను' అని పైలట్ ఇక్కడ విలేకరులతో అన్నారు. ఇప్పుడు అవినీతిపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేయడం కూడా 'పార్టీ వ్యతిరేక చర్య' అని పిలవబడుతోందని తెలిపారు. నగరంలోని జడ్ఖడ్ ఆలయం (శివాలయం)లో ప్రార్థనలు చేసిన అనంతరం పైలట్ మీడియాతో మాట్లాడారు. అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అనేక మంది అవినీతి ఐఏఎస్లు, ఐపీఎస్లు, ఆర్ఏఎస్లతో పాటు ఇతర అధికారులను అరెస్టు చేసిన చర్యను స్వాగతిస్తున్నట్లు తెలిపారు. 'ఏసీబీ చురుగ్గా పనిచేస్తోందని, అనేక మంది అవినీతి అధికారులపై దాడులు చేశామని ముఖ్యమంత్రి స్వయంగా చెప్పారని, దానిని మేమంతా స్వాగతిస్తున్నాం. ఐదేళ్లపాటు ప్రతిపక్షంలో ఉండి అధికారంలోకి వచ్చాక పట్వారీని, అధికారిని అరెస్టు చేస్తామని మేం ఎప్పుడూ చెప్పలేదు. వసుంధరా జీ హయాంలో జరిగిన అవినీతి కేసులపై చర్యలు తీసుకుంటామని చెప్పాం' అని పైలట్ చెప్పారు. పైలట్ ఒక రోజు నిరాహార దీక్ష చేపట్టిన తర్వాత, ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోత్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా జరగని విధంగా రాష్ట్రంలో అవినీతికి పాల్పడిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను ఏసీబీ అరెస్టు చేసిందని తెలిపారు. సచిన్ పైలట్ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు అవినీతి పెద్ద సమస్యగా ఉన్నందున ప్రజలు ఓట్లు వేశారని, అసెంబ్లీ ఎన్నికలకు చాలా తక్కువ సమయం ఉన్నందున చర్యలు తీసుకోవాలని అన్నారు. 'మనమందరం బీజేపీ చేసిన అవినీతిని లేవనెత్తినా లేదా నేను మునుపటి వసుంధర రాజే ప్రభుత్వ అవినీతి సమస్య లను లేవనెత్తి, వాటిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసినా, అది పార్టీకి ప్రయోజనం చేకూరుస్తుందని నేను నమ్ముతున్నాను' అని పైలట్ అన్నారు. సెప్టెంబరు 2022లో పార్టీ అధిష్టానాన్ని సవాలు చేసిన పార్టీ నాయకులపై నిష్క్రియాత్మకతపై కూడా ఆయన ప్రశ్నలు లేవనెత్తారు. 'సెప్టెంబర్ 25న జరిగిన సంఘటన మా కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ ఆదేశాలను బహిరంగంగా ఉల్లంఘించిన మాట వాస్తవమే. మల్లికార్జున్ ఖడ్గే, అజయ్ మాకెన్ను బహిరంగంగా అవమానించారు. వారిపై ఇంతవరకు ఎందుకు చర్యలు తీసుకోలేదు? ఇది ప్రశ్న, సమాధానం పార్టీ వద్ద ఉంది' అని పైలట్ అన్నారు.

బసవేశ్వరునికి రాహుల్ నివాళి

బాగల్కోట్ (కర్నాటక): 12వ శతాబ్దపు కవి, సంఘ సంస్కర్త బసవేశ్వరుని జయంతి సందర్భంగా కుదాల సంగమలోని బసవేశ్వరుని స్మారక స్థలం వద్ద ఆదివారం కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ నివాళులర్పించారు. ఢిల్లీ నుంచి హుబ్బళ్లి చేరుకున్న ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు సంగమనాథ దేవాలయం, ఐక్య లింగ దర్శనం కోసం హెలికాప్టర్లో కూడల సంగమానికి వెళ్లారు. బాగలకోట్ జిల్లాలో కృష్ణా, మలప్రభ నదుల సంగమం వద్ద ఉన్న కుదాల సంగమం ఒక యాత్రా కేంద్రం. ఐక్య మంటపం లేదా లింగాయత్ శాఖ స్థాపకుడు బసవన్నగా ప్రసిద్ధి చెందిన బసవేశ్వరుని పవిత్ర సమాధి, స్వయంభువుగా విశ్వసించబడే లింగంతో పాటు ఇక్కడ ఉంది. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్, మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రచార కమిటీ అధ్యక్షుడు ఎం.బి.పాటిల్ తదితర నేతలతో కలసి బసవ మంటపంలో ఉత్సవ సమితి అధ్వర్యంలో నిర్వహించిన బసవ జయంతి కార్యక్రమంలో రాహుల్ గాంధీ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అనేక మంది లింగాయత్ గణనాథులు పాల్గొన్నారు. రాహుల్ ఈ పర్యటన మే 10న రాష్ట్రంలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు ముందు లింగాయత్ సామాజిక వర్గానికి చెందిన ఓటర్లను ఆకర్షించేందుకు కాంగ్రెస్ చేసిన ప్రయత్నంగా భావిస్తున్నారు. లింగాయత్లు రాష్ట్ర జనాభాలో దాదాపు 17 శాతం ఉన్న ఆధిపత్య సమాజం, ఎక్కువగా పాలక బీజేపీ ఓటు బ్యాంకుగా పరిగణిస్తున్నారు. ఈ కార్యక్రమంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ భారతదేశంలో ప్రజాస్వామ్యం, పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, హక్కులకు పునాది వేసిన బసవన్న, అతనిలాంటి వ్యక్తులను కృతజ్ఞతతో స్మరించుకున్నారు. 'బసవన్న తన జీవితాంతం సత్య మార్గాన్ని విడిచిపెట్టలేదు. ఎటువంటి భయం లేకుండా సత్యాన్ని చెప్పాడు. సమాజం ముందు నిజం మాట్లాడటం అంత సులభం కాదు. బెదిరింపులు ఉన్నప్పటికీ బసవన్న సత్యమార్గం నుంచి తప్పుకోలేదు. సమాజంలోని చెడు పద్ధతులను ప్రశ్నించాడు. అందువల్ల ఆయన నేటికీ గౌరవించబడుతున్నాడు' అని తెలిపారు.

ఐదో రోజూ 10 వేలపైనే కేసులు

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా కరోనా మహమ్మారి మళ్లీ ఉధృతమవుతోంది. కేసుల సంఖ్య రోజురోజుకీ గణనీయంగా పెరుగుతోంది. గడిచిన 24 గంటల్లో 10,112 పాజిటివ్ కేసులు నమోదయ్యాయని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. 10 వేలకు పైగా కేసులు నమోదవ్వడం ఇది వరుసగా ఐదో రోజు. శుక్రవారం కొత్తగా 12,193 కేసులు నమోదయ్యాయి. శనివారం బయపడిన కేసులతో క్రియాశీల కేసుల సంఖ్య 67,806కు చేరింది. దేశవ్యాప్తంగా కొవిడ్ క్రియాశీలత రేటు 7.03 శాతంగా ఉంది. దేశ రాజధాని ఢిల్లీలో పాజిటివిటీ రేటు 26.46 శాతంగా ఉంది. ఢిల్లీలో శనివారం ఒక్కరోజే 1,515 కేసులు నమోదయ్యాయి. ఆరుగురు మృత్యువాతపడ్డారు. మహారాష్ట్రలో గడిచిన 24 గంటల్లో కొత్తగా 850 కేసులు బయటపడ్డాయి. నలుగురు మరణించారు. కేసుల సంఖ్య గణనీయంగా పెరిగినప్పటికీ ఈ వేరియంట్ మరీ అంత శక్తిమంతమైనది కాదని పుణెలోని సీరమ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండియా సీఈవో ఆధార్ పూనావాలా చెప్పారు. ఈ వేరియంట్ కొంతవరకు మాత్రమే ప్రభావం చూపగలదన్నారు.

పిల్లలకు బూస్టర్ డోస్ వద్దు: డబ్ల్యూహెచ్ఓ

ఆరోగ్యంగా ఉన్న పిల్లలు, కౌమార బాలబాలికలు కోవిడ్-19 టీకా బూస్టర్ డోస్ తీసుకోవాల్సిన అవసరం పెద్దగా లేదని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) తాజాగా సూచించింది. ఇతర టీకాలు మాత్రం తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపింది. రోటావైరస్, తట్టు (మీజిల్స్), న్యూమోకాకల్ కాంజుగేట్ టీకా లాంటి అత్యవసర సంప్రదాయ టీకాలతో పోలిస్తే పిల్లలు, కౌమార బాలబాలికల మీద కోవిడ్ టీకాల ప్రభావం చాలా తక్కువని డబ్ల్యూహెచ్ఓ తెలిపింది.

ఆరేళ్ల బాలుడి బ్రెయిన్డెడ్

అవయవదానంతో ఇద్దరికి కొత్త జీవితం

న్యూఢిల్లీ: తలకు తీవ్ర గాయమై బ్రెయిన్డెడ్గా ప్రకటించబడిన ఆరేళ్ల బాలుడి కుటుంబం అతని అవయవాలను దానం చేసి ఇద్దరు పిల్లలకు కొత్త జీవితాన్ని ఇచ్చింది. ఏప్రిల్ 24వ తేదీ రాత్రి 10.11 గంటలకు ఆ చిన్నారి బ్రెయిన్ డెడ్ అయినట్లు ఢిల్లీలోని ఎయిమ్స్ వైద్యులు నిర్ధారించారు. వైద్యుల కౌన్సెలింగ్ తర్వాత కుటుంబ సభ్యులు ఆమె అవయవాలను దానం చేయడానికి అంగీకరించారు. ఏప్రిల్ 15న ద్విచక్ర వాహనం ఢీకొనడంతో రోగి తలకు బలమైన గాయం కావడంతో ఎయిమ్స్ ట్రామా సెంటర్లో చేర్చారు. గత ఏప్రిల్ నుండి ఎయిమ్స్ అపెక్స్ ట్రామా సెంటర్లో 19 అవయవదానాలు జరగ్గా చిన్న పిల్లలకు (1-6 సంవత్సరాల వయస్సులో ఉన్నవారు)కు సంబంధించి ఇది ఐదవ దానం. ఎయిమ్స్ వైద్యుడు డాక్టర్ గుప్తా మాట్లాడుతూ... 'యాదృచ్ఛికంగా బ్రెయిన్ డెడ్ అయిన 6 ఏళ్ల మాస్టర్ ఎస్ కేవలం ఒక కిడ్నీతో జన్మించాడు. అందువల్ల ఢిల్లీలోని ఎయిమ్స్లో మరొక అబ్బాయికి మార్పిడి చేయడానికి ఒక మూత్రపిండాన్ని మాత్రమే తిరిగి పొందగలిగాం... కాలేయం మరొక 16 ఏళ్ల బాలుడికి మార్పిడి చేయబడింది' అని చెప్పారు.

ఢిల్లీలో టీవీ జర్నలిస్టుపై దాడి

న్యూఢిల్లీ: ఓ టీవీ జర్నలిస్టుపై ముగ్గురు దుండగులు దాడికి పాల్పడిన ఘటన ఢిల్లీలో చోటుచేసుకుంది. తూర్పు ఢిల్లీలోని సంజయ్ సరస్సు పార్కులో వాకింగ్ చేస్తుండగా దాడి చేసిన దుండగులు... అతడి మొబైల్ ఫోన్, పర్సులో క్రెడిట్, డెబిట్ కార్డులు, ఆఫీస్ ఐడెంటిటీ కార్డులు దోచుకున్నారని పోలీసులు తెలిపారు. బాధిత రిపోర్టర్ ఝుండేవాలన్లో కార్యాలయాన్ని కలిగి ఉన్న తన సంస్థకు ఢిల్లీ చీఫ్ ఆఫ్ బ్యూరో అని పేర్కొన్నారు. బాధితుడు శనివారం ఝుండేవాలన్ నుంచి బస్సు ఎక్కి మంగళం చౌక్లో దిగగా, అక్కడి నుంచి పాండవ్నగర్లోని సంజయ్ సరస్సు వద్దకు వాకింగ్కు వెళ్లాడు. సరస్సు చుట్టుపక్కల ఉన్న పార్క్లో, ముగ్గురు యువకులు అతనిని తన వస్తువులను ఇచ్చేయాలని బెదిరించారు. అతను ప్రతిఘటించడంతో, పదునైన ఆయుధంతో అతనిపై దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. దుండగులను పట్టుకునేందుకు గాలింపు జరుపుతున్నట్లు పేర్కొన్నారు.

తొమ్మిదేళ్లలో 50వేల కి.మీ.ల మేర రహదారుల విస్తరణ

న్యూఢిల్లీ: ఆర్థికవ్యవస్థకు ఊతమిచ్చేలా మౌలిక సదుపాయాల పెంపుదల కోసం గత 9 ఏళ్లలో అసాధారణరీతిలో 50వేల కిలోమీటర్ల మేర జాతీయ రహదారుల విస్తరణ జరిగినట్లు కేంద్రం ప్రభుత్వం పేర్కొంది. అధికారిక సమాచారం ప్రకారం... భారతదేశం లో 2014-15లో మొత్తం 97,830 కి.మీ. మేర ఉన్న రహదారులు మార్చి 2023 నాటికి 145,155 కి.మీలకు విస్తరించబడ్డాయి. 2014-15లో రోజుకు 12.1 కి.మీ రోడ్లు నిర్మించగా, 2021-22లో ప్రతిరోజూ 28.6 కి.మీ. మేర రోడ్లు నిర్మించబడుతున్నాయి. దేశ ఆర్థిక వ్యవస్థలో రోడ్లు, హైవేలు కీలక పాత్ర పోషిస్తాయి. రోడ్డు రవాణా అనేది ఆర్థికాభివృద్ధికి మాత్రమే కాకుండా సామాజిక అభివృద్ధికి, రక్షణ రంగాలకు, జీవితానికి అవసరమైన ప్రాథమిక వస్తువులకు కూడా ప్రాతిపదిక. ఒక నివేదిక ప్రకారం, ప్రతి సంవత్సరం 85 శాతం ప్రయాణీకులు, 70 శాతం వస్తువుల రవాణా రోడ్ల ద్వారానే జరుగుతోంది. భారతదేశం దాదాపు 63.73 లక్షల కి.మీ.రోడ్డు నెట్వర్క్ను కలిగి ఉంది, ఇది ప్రపంచంలో రెండవ అతిపెద్దది. సరుకు రవాణా, ప్రయాణీకుల సమర్థ రవాణాను ప్రారంభించడం, ప్రజలను అనుసంధానించడం, ఆర్థిక కార్యకలాపాలను సులభతరం చేయడం ద్వారా దేశ ఆర్థిక సామాజిక అభివృద్ధిలో జాతీయ రహదారులు చాలా ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని ప్రభుత్వం తెలిపింది.

ఊపిరాడక ఇద్దరు పారిశుధ్య కార్మికుల మృతి

అహ్మదాబాద్: భూగర్భ మురుగు కాల్వను శుభ్రం చేస్తుండగా ఊపిరాడక ఇద్దరు పారిశుధ్య కార్మికులు మృతి చెందారు. గుజరాత్లోని అహ్మదాబాద్ జిల్లా ధోల్కా పట్టణంలో ఈ ఘటన చోటుచేసుకుంది. గోపాల్ పదార్ (24), బిజల్ పధర్ (32) అనే ఇద్దరు కార్మికులు శుభ్రం చేయడానికి మురుగునీటి కాల్వలోకి దిగారు. అయితే కొంత సేపటికే స్పృహతప్పి పడిపోయారు. వారిని వెంటనే ఆసుపత్రికి తరలించగా, అప్పటికే వారు చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారని ధోల్కా పోలీస్ స్టేషన్ అధికారి తెలిపారు. శనివారం సాయంత్రం 5 గంటలకు ఇద్దరూ గట్టర్ లైన్లోకి ప్రవేశించినప్పుడు ఈ సంఘటన జరిగిందని, వారు ఊపిరాడక మరణించారని ఆయన పేర్కొన్నారు. సంబంధిత పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు ఆషిక్ ఠాకూర్, జగదీష్ ఠాకూర్లపై ఐపీసీ సెక్షన్ 304, ఎస్సీఎస్టీ అట్రాసిటీ చట్టంలోని సంబంధిత నిబంధనల ప్రకారం ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు వెల్లడించారు. గత రెండేళ్లలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో మురుగు కాల్వల్ని శుభ్రం చేస్తున్నప్పుడు ఊపిరాడక 11 మంది పారిశుధ్య కార్మికులు మరణించారని గుజరాత్ ప్రభుత్వం ఇటీవల శాసనసభకు తెలియజేసింది. కాగా మానవ్ గరిమ అనే స్వచ్ఛంద సంస్థ గుజరాత్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని (పిల్) దాఖలు చేసింది, డ్రైనేజీ లైన్లు లేదా సెప్టిక్ ట్యాంక్లను శుభ్రపరిచేటప్పుడు మ్యాన్హోల్ కార్మికుల మరణాలను నివారించడానికి తగిన చర్యలు చేపట్టడంతో పాటు మరణించిన వారి కుటుంబాలకు పరిహారం ఇవ్వాలని కోరింది. 1993-2014 మధ్య మరణించిన 152 మ్యాన్హోల్ కార్మికులలో 26 మంది కుటుంబాలకు, 2016లో తన ప్రధాన పిటిషన్ దాఖలు చేసిన తర్వాత మరణించిన 16 మంది కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం పరిహారం చెల్లించలేదని పేర్కొంది.

ప్రధానిని చంపేస్తామని లేఖ రాసిన నిందితుడి అరెస్టు

కొచ్చి: ప్రధాని నరేంద్ర మోదీపై ఆత్మాహుతి దాడికి పాల్పడతామంటూ బెదిరింపు లేఖ రాసిన నిందితుడిని కేరళ పోలీసులు అరెస్ట్ చేశారు. కొచ్చి నివాసి గ్జేవియర్... పట్టణంలో వ్యాపారం చేస్తుంటాడు. మరొకరి పేరుతో బెదిరింపు లేఖ రాసిన ఇతడిని పోలీసులు అరెస్టు చేశారు. కేరళలో రెండ్రోజుల పర్యటనకు ప్రధాని రానున్నారు. ఈ క్రమంలోనే ఆత్మాహుతి దాడితో ఆయన్ను చంపేస్తామంటూ కొచ్చి నివాసి ఎన్జే జానీ పేరుతో బీజేపీ చీఫ్ సురేంద్రన్కి మలయాళం భాషలో లేఖ వచ్చింది. వెంటనే ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ ప్రారంభించిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. కేరళ సిటీ పోలీస్ కమిషనర్ కే సేతు రామన్ ఇదే విషయాన్ని వెల్లడించారు. 'ప్రధాని మోదీని హత్య చేస్తామంటూ లెటర్ పంపిన వ్యక్తిని అరెస్ట్ చేశాం. కేవలం వ్యక్తిగత శత్రుత్వంతోనే ఈ పని చేశాడు. ఫోరెన్సిక్స్ ద్వారా నిందితుడిని గుర్తించాం' అని పేర్కొన్నారు.

భూ పోరాటానికి సమాయత్తం కావాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పిలుపు
- ఎర్రజెండా పోరాటాల ఫలితమే హక్కుల సాధన : జల్లి విల్సన్

విశాలాంధ్ర బ్యూరో నెల్లూరు: భూ పోరాటానికి సమాయత్తం కావాలని గ్రామీణ శ్రమజీవులకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ పిలుపునిచ్చారు. కోవూరు నియోజకవర్గంలోని ఎల్లాయపాలెంలో ఆదివారం జరిగిన నెల్లూరు జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కూలి రేట్ల కోసం నాడు ఎన్నో పోరాటాలు చేసి నెల్లూరు జిల్లాలో వ్యవసాయ కార్మిక సంఘం పుట్టిందనీ, అది నేడు దేశవ్యాప్తంగా వ్యాప్తి చెందిందని చెప్పారు. ఈ రోజు గ్రామీణ ప్రాంతాలలో వలసలు తగ్గి గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్నారంటే దానికి కారణం ఎర్రజెండానే అని అన్నారు. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నాలు సాగిస్తోందని విమర్శించారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా కార్పొరేట్ శక్తుల చేతులలో పెట్టి ఇటు రైతాంగాన్ని, వ్యవసాయ కూలీలను పూర్తిగా రోడ్లపాలు చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాన్ని తిప్పికొట్టవలసిన అవసరం ఉందనీ, అందుకు మరో పోరాటానికి వ్యవసాయ కార్మికులంతా సిద్ధం కావాలని రామకృష్ణ పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టేందుకు వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో చేస్తున్న ఈ పోరాటానికి ప్రజలంతా తమ సంఘీభావాన్ని తెలుపుతూ పోరాటంలో భాగస్వాములు కావాలన్నారు. మోదీ అధికారం చేపట్టిన నాటి నుంచి పేద ప్రజలకు పంచవలసిన భూములను పెత్తందారులకు, కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో జగన్ పరిపాలనలో నాలుగేళ్లలో రాష్ట్రంలో తడ నుంచి ఇచ్ఛాపురం వరకు ఎక్కడైనా అభివృద్ధి జరిగిందా? అని ప్రశ్నించారు. ప్రభుత్వం పనితీరును ప్రశ్నించిన వారిపైనే తిరిగి కేసులు బలాయించడం, ప్రభుత్వానికి నిరసన తెలపాలని తలపెట్టిన సంఘాలపై వెంటనే వారిని అరెస్టు చేసి కేసులు బరాయించడమే ఈ ప్రభుత్వం చేస్తున్న పని అని రామకృష్ణ విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు జల్లి విల్సన్ మాట్లాడుతూ, ఎర్రజెండా నీడన చేసిన పోరాటాల ఫలితమే నేడు ఎన్నో హక్కులను సాధించుకోగలిగామని అన్నారు. అసైన్‌మెంట్ భూములు, భూ సంస్కరణల చట్టాలు ఏర్పడ్డాయంటే అది వ్యవసాయ కార్మిక సంఘం పోరాట ఫలితమే అని విల్సన్ చెప్పారు. నాడు వ్యవసాయ కార్మిక సంఘం చేసిన పోరాట ఫలితంగా కోనేరు రంగారావు కమిటీ కొన్ని సిఫార్సులను రాష్ట్ర ప్రభుత్వానికి చేసిందని అయితే నాటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి వాటిని ఆమోదయోగ్యంగా ఉన్నాయని అమలు చేయాలని ప్రయత్నించారనీ, ఆయన అకాల మరణంతో అవి అక్కడే ఆగిపోయాయని, నేడు ఆయన పేరు చెప్పుకొని అధికారంలోకి వచ్చిన ఆయన కొడుకు జగన్ ఈ విషయంపై దృష్టి పెట్టి కోనేరు రంగారావు కమిటీ సిఫార్సులను అమలు చేసి రైతాంగాన్ని, వ్యవసాయ కార్మికులని ఆదుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న జగనన్న కాలనీలలో పేదవారు ఇల్లు కట్టుకునేందుకు అవసరమైన ఇసుక, సిమెంటు, ఇనుము ఉచితంగా అందజేసి వారికి ఐదు లక్షల రూపాయలు ఆర్థికంగా సాయం అందించాలనీ, ఇళ్ల నిర్మాణానికి ప్రస్తుత ఇస్తున్న స్థలం చాలదన్నారు. ఈ మహాసభలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, రాష్ట్ర నాయకులు ఆర్ వెంకట్రావు, సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నందిపోగుల రమణయ్య పాల్గొన్నారు. ఈ మహాసభకు అధ్యక్ష వర్గంగా దమ్ము దర్గా బాబు, బాలకోటయ్య, నంది పోగుల రమేష్ బాబు వ్యవహరించారు. దళిత ఎల్లయ్యపాలెం గ్రామాల్లోని వీధుల మీదుగా జిల్లా నలు మూలల నుండి పాల్గొన్న వ్యవసాయ కార్మికులు ప్రదర్శనగా బయలుదేరి మహాసభ వేదిక వద్దకు చేరుకున్నారు, ఈ మహాసభ వేదికకు కడివేటి వెంకయ్య ప్రాంగణంగా నామకరణం చేశారు.

శాంతి, సామరస్యాలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవు: మాన్

చండీగఢ్: శాంతి, సామరస్యాలకు విఘాతం కలిగించేందుకు ప్రయత్నించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ స్పష్టం చేశారు. ఏప్రిల్ 23న వేర్పాటువాది అమృతపాల్ సింగ్‌ను అరెస్టు చేసిన కొన్ని గంటల తర్వాత ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అమృతపాల్ కోసం 30 రోజుల పాటు సాగిన వేటలో పంజాబ్ రాష్ట్రంలో శాంతిని కాపాడినందుకు మాన్ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. '35 రోజుల తర్వాత ఈరోజు అమృత్‌పాల్ సింగ్‌ని అరెస్టు చేశారు' అని మాన్ వీడియో సందేశంలో తెలిపారు. శాంతి, సామరస్యాలకు విఘాతం కలిగించి దేశ చట్టాన్ని ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని, ఏ అమాయకులను ఇబ్బంది పెట్టబోమని, ప్రతీకార రాజకీయాలు చేయబోమని ఆయన అన్నారు. 'ఈ 35 రోజుల్లో శాంతి, సామరస్యాన్ని కాపాడినందుకు 3.5 కోట్ల పంజాబీలకు ధన్యవాదాలు' అని ముఖ్యమంత్రి అన్నారు.

సామూహిక వివాహాల వివాదం

దిండోరి: మధ్యప్రదేశ్ ప్రభుత్వం సామూహిక వివాహ పథకం వివాదాన్ని రేకెత్తించింది. కాబోయే వధువులలో కొందరు గర్భిణులుగా ఉన్నట్లు గుర్తించారు. ప్రతిపక్ష కాంగ్రెస్ ఈ మహిళలను ఏ మార్గదర్శకాల ప్రకారం వైద్య పరీక్షలకు గురిచేశారో తెలుసుకోవాలని కోరింది. అక్షయ తృతీయను పురస్కరించుకుని శనివారం 'ముఖ్యమంత్రి కన్యా వివాహ యోజన' కింద దిండోరి జిల్లాలోని గడసరాయ్ పట్టణంలో 219 జంటల వివాహానికి సంబంధించి ఈ సమస్య ఉందని ఆదివారం ఒక అధికారి తెలిపారు. అటువంటి పరీక్ష పేదలను అవమానించడమేనని కాంగ్రెస్ శాసనసభ్యుడు ఓంకార్ సింగ్ మార్కం తెలిపారు. 'అలాంటి గర్భ పరీక్షలకు మార్గదర్శకాలు లేదా నియమాలు ఏమిటో రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేయాలి' అని అన్నారు. అయితే దీనిని సమర్థిస్తూ, దిండోరి కలెక్టర్ వికాస్ మిశ్రా పీటీఐతో మాట్లాడుతూ సామూహిక వివాహ కార్యక్రమంలో పాల్గొన్న వారిలో సికెల్ సెల్ వ్యాధిని గుర్తించడం కోసం ఆదేశాలు జారీ అయ్యాయని తెలిపారు. వైద్య పరీక్షల సమయంలో కొంతమంది వధువులు పీరియడ్స్ సమస్యల గురించి మాట్లాడారని, ఆ తర్వాత అక్కడ వైద్యులు అటువంటి ఫిర్యాదులు ఉన్న వారికి గర్భ పరీక్షలను నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారని మిశ్రా తెలిపారు.

ఢిల్లీలో మళ్లీ రెజ్లర్ల నిరసన

రెజ్లర్స్ ఫెడరేషన్ చీఫ్ బ్రిజ్ భూషణ్‌పై చర్యకు డిమాండ్

న్యూఢిల్లీ: దేశానికి చెందిన టాప్ రెజ్లర్లు మళ్లీ నిరసనకు దిగారు. దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆదివారం బైఠాయించారు. మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధించిన ఫెడరేషన్ చీఫ్ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై ఏడుగురు మహిళా రెజ్లర్లు తాజాగా ఫిర్యాదు చేశారు. సెంట్రల్ ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు ఇచ్చారు. అయితే పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం, ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడంపై వారు మండిపడ్డారు. బీజేపీ నాయకుడైన ఫెడరేషన్ చీఫ్ బ్రిజ్ భూషణ్ లైంగిక వేధింపులపై దర్యాప్తు కోసం నియమించిన కమిటీ రిపోర్ట్‌ను, మహిళా రెజ్లర్లు ఇచ్చిన వాంగ్మూలాన్ని బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఫిర్యాదు చేసిన బాధితుల పేర్లు లీక్ కాకుండా చూడాలని కోరారు. కాగా, బీజేపీ నేత అయిన రెజ్లర్స్ ఫెడరేషన్ చీఫ్ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై తాము ఎన్ని ఫిర్యాదులు చేసినప్పటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదని వినేష్ ఫోగట్ మండిపడ్డారు. మరోసారి ఫిర్యాదు చేసినా పోలీసులు కేసు నమోదు చేయలేదని విమర్శించారు. 'మాకు న్యాయం జరిగే వరకు ఇక్కడే ఉంటాం. ఇక్కడే తిని ఇక్కడే నిద్రిస్తాం' అని అన్నారు. కేంద్ర క్రీడల మంత్రి అనురాగ్ ఠాకూర్, ఇతర అధికారులను సంప్రదించేందుకు మూడు నెలలుగా ప్రయత్నిస్తున్నప్పటికీ ఎలాంటి ఫలితం లేదని వాపోయారు. తమ కెరీర్‌ను పణంగా పెట్టామని, దేశం కోసం పతకాలు సాధించామని ఆవేదన వ్యక్తం చేశారు. ఫెడరేషన్ చీఫ్ బ్రిజ్ భూషణ్‌ను అరెస్ట్ చేసేంత వరకు తాము ఇక్కడి నుంచి వెళ్లబోమని టాప్ రెజ్లర్ బజరంగ్ పునియా మీడియాతో అన్నారు. మరోవైపు రెజ్లర్స్ ఫెడరేషన్ చీఫ్ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ తమను లైంగికంగా వేధిస్తున్నట్లు అనేకమంది మహిళా రెజ్లర్లు ఆరోపించారు. ఆయనపై చర్యలకు డిమాండ్ చేస్తూ ఈ ఏడాది జనవరిలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసనకు దిగారు. దీంతో జనవరి 23న దిగ్గజ బాక్సర్ మేరీకోమ్ నేతృత్వంలో ఐదుగురు సభ్యులతో కూడిన పర్యవేక్షణ కమిటీని క్రీడా మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసింది. నెలలోపు రిపోర్ట్ సమర్పించాలని కోరింది. ఆ తర్వాత ఈ గడువును రెండు వారాలకు పొడిగించింది. నిరసనకారుల డిమాండ్‌తో బబితా ఫోగట్‌ను ఆరో సభ్యురాలిగా కమిటీలో చేర్చింది. కాగా, ఈ కమిటీ తన నివేదికను ఏప్రిల్ తొలి వారంలో సమర్పించింది. అయితే ఈ నివేదికను క్రీడా మంత్రిత్వ శాఖ విడుదల చేయలేదు. అలాగే ఫెడరేషన్ చీఫ్ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై వచ్చిన లైంగిక వేధింపు ఆరోపణలను రెజ్లర్లు నిరూపించలేకపోయినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈ నేపథ్యంలో రెజ్లర్లు మరోసారి నిరసనకు దిగారు. కమిటీ రిపోర్ట్‌ను బయటపెట్టాలని, బ్రిజ్ భూషణ్‌పై కేసు నమోదు చేసి ఆయనను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

అర్ష్‌దీప్‌పై ప్రశంసలు

న్యూఢిల్లీ: ఐపీఎల్ 16వ సీజన్‌లో హడలెత్తిస్తున్న యువ పేసర్ అర్ష్‌దీప్ సింగ్‌పై ప్రశంసలు కురుస్తున్నాయి. ముంబై ఇండియన్స్‌తో శనివారం జరిగిన మ్యాచ్‌లో 20వ ఓవర్‌లో సంచలన బౌలింగ్‌తో పంజాబ్ కింగ్స్‌ను గెలిపించిన తీరు అద్వితీయం. అమోఘం అంటున్నారంతా. ఒకప్పుడు నో బాల్స్‌తో విమర్శల పాలైన అతడేనా... ఇప్పుడు ఇలా బౌలింగ్ చేస్తోందంటూ నోరెళ్ల బెడుతున్నారంతా. ఇదంతా ఎలా సాధ్యమైంది? అని అడిగితే.. 'రనప్ మార్చుకున్నా. దాంతో, నో బాల్స్ వేయట్లేదు' అని ఈ ఎడమ చేతివాటం పేసర్ తెలిపాడు. టీ20ల్లో ఒకే ఓవర్‌లో అత్యధిక నో బాల్స్ వేసిన బౌలర్‌గా అర్ష్‌దీప్ చెత్త రికార్డు మూటగట్టుకున్న విషయం తెలిసిందే. ముంబై ఇండియన్స్‌పై అర్ష్‌దీప్ సింగ్ చెలరేగాడు. ఆఖరి ఓవర్‌లో రెండుసార్లు మిడిల్ స్టంప్‌ను విరగొట్టాడు. వరుస బంతుల్లో తిలక్ వర్మ(3), ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన నేహాల్ వధేరా(0)ను ఒకే స్టయిల్లో బౌల్డ్ చేశాడు. అతని స్వింగ్ వేగానికి రూ.24 లక్షల విలువైన మిడిల్ స్టంప్ రెండు ముక్కలైంది. అతని దెబ్బకు ముంబై బ్యాటర్లు రెండు పరుగులు చేశారంతే. దాంతో, పంజాబ్ 13 పరుగుల తేడాతో గెలుపొందింది. సామ్ కరన్(55), హర్‌ప్రీత్ సింగ్ భాటియా(41) ఐదో వికెట్‌కు 92 రన్స్ జోడించారు. ఆ తర్వాత వచ్చిన జితేశ్ శర్మ (25) దంచడంతో పంజాబ్ 214 రన్స్ చేసింది. ఆ తర్వాత రోహిత్ శర్మ(44), కామెరూన్ గ్రీన్(67), సూర్యకుమార్ యాదవ్(57) ధనాధన్ ఇన్నింగ్స్ ఆడినా కానీ, చివర్లో పంజాబ్ బౌలర్లు పుంజుకోవడంతో ముంబైకి ఓటమి తప్పలేదు.

కాకినాడలో

విజయవాడలో

అల్లూరి పోరాట స్ఫూర్తితో మోదీని గద్దె దింపుదాం

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు రావుల వెంకయ్య

విశాలాంధ్ర - కాకినాడ: విప్లవ వీరుడు అల్లూరి సీతారామ రాజు పోరాట స్ఫూర్తితో కేంద్రం లోని మోదీని గద్దె దింపుదామనీ, ఆ లక్ష్యంతో ముందుకు వెళదామని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు రావుల వెంకయ్య పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం ఇక్కడి డెయిరీ ఫార్మ్‌లో జరిగిన సీపీఐ ప్రచారభేరి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రావుల వెంకయ్య మాట్లా డుతూ సంఘ్‌పరివార్ ఫాసిస్టు శక్తులు దేశ ప్రజలను తీవ్ర కష్టాల పాలు చేస్తున్నారు. ప్రజల ఆస్తులైన ప్రభుత్వ రంగ సంస్థలను అదానీ, అంబానీల పరం చేస్తున్నారన్నారు. గోరక్షణ పేరుతో నిత్యం మైనారిటీలను, దళితులపై దాడు లకు తెగబడుతున్నారన్నారు. తమను వ్యతిరేకించే వారిపైకి, ప్రశ్నించే వారిపైకి రాజ్యాంగ వ్యవస్థలను ఉసిగొల్పి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని విమర్శించారు చివరకు సుప్రీంకోర్టు కూడా తమ కను సన్నలలో ఉండాలని, తమకు రబ్బరు స్టాంపుగా మారాలని కుట్రలు చేస్తున్నా రన్నారు. వీరి దుర్మార్గాలకు, దౌర్జన్యాలకు, రాజ్యాంగ వ్యతిరేక చర్యలపై పోరుకు అన్ని వర్గాల ప్రజలను ఐక్యం చేయాల్సి వుందన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు కూడా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కాకినాడ జిల్లా కార్యదర్శి కె బోడకుండా, సహాయ కార్యదర్శులు తోకల ప్రసాద్, జి లోవరత్నం, నాయకులు రాజు, బుజ్జి, ఎల్లమ్మ, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఓటు ద్వారా ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం: అక్కినేని వనజ

విశాలాంధ్ర-విజయవాడ: కేంద్రంలో నిరంకుశ, మతోన్మాద విధానాలను అనుసరిస్తున్న బీజేపీ ప్రభుత్వానికి ఓటు ద్వారా బుద్ధిచెప్పి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందామని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ అన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ సీపీఐ, సీపీఎం విజయవాడ నగర సమితిల ఆధ్వ ర్యంలో మోదీ హటావో దేశ్ కి బచావో నినాదంతో నిర్వహిస్తున్న ప్రచార భేరిలో ఆమె పాల్గొన్నారు. ఆదివారం భ్రమరాంబపురంలోని సీపీఐ కార్యా లయం వద్ద నుంచి 9వ రోజు ప్రచార భేరి ప్రారంభ మైంది. ఈ సందర్భంగా వనజ మాట్లాడుతూ కార్మికులు, కష్ట జీవులు సృష్టించిన సంపదను అదాని, అంబానీలకు దోచిపెడు తున్నారని విమర్శించారు. పార్లమెంట్, ప్రజా స్వామ్యం, రాజ్యాంగం అంటే మోదీకి గౌరవం లేదన్నారు. కులాలు, మతాల మధ్య చిచ్చురేపుతున్నారని చెప్పారు. మోదీ పాలనలో సామాజిక న్యాయం ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ విషయంలో బీజేపీ ప్రభుత్వం చేస్తున్న ద్రోహం అంతా ఇంతా కాదన్నారు. పార్లమెంటు సాక్షిగా చేసిన చట్టాలను అమలు చేయటం లేద న్నారు. పోలవరం పూర్తైయితే 17 లక్షల ఎకరాలకు సాగునీరు, కృష్ణాడెల్టాకు ఆయకట్టు స్థిరీకరణ, విశాఖకు సాగు, త్రాగు నీరు లభిస్తుందన్నారు. ఇంత ప్రాధాన్యత ఉన్న పోలవరంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. దేశాభివృద్ధిని కాంక్షించే ప్రజాస్వామ్యవాదులు మోదీ, జగన్ ప్రభుత్వాలు చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొటట్టానికి ఆలోచన చేయాలని కోరారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సీహెచ్.బాబూరావు మాట్లాడుతూ విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటీకరించవద్దని డిమాండ్ చేస్తూ మే 3న రాష్ట్రవ్యాప్తంగా జరిగే రాస్తారోకోలో కమ్యూనిస్టు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దోనేపూడి శంకర్, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాధ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని సాగనంపుదాం - దేశాన్ని కాపాడుకుందాం: ఈశ్వరయ్య

విశాలాంధ్ర-గిద్దలూరు: బీజేపీని సాగనంపు దాం దేశాన్ని కాపాడుకుందామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య పిలుపు నిచ్చారు. ప్రకాశం జిల్లా గిద్దలూరులోని సీపీఎం కార్యాలయంలో ఆదివారం సీపీఎం, సీపీఐ ప్రచార భేరి సభ సీపీఎం నాయకులు టీ ఆవులయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈశ్వరయ్య మాట్లాడుతూ భారతదేశంలో మోదీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక మతోన్మాద శక్తిగా మారిందనీ, దీన్ని త్వరలో సాగనంపాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా కార్పొ రేటర్లకు అప్పజెప్పి, పేదలపై భారాలు మోపుతోందన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌డీ అనీఫ్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం మతోన్మాద బీజేపీకి మద్దతిస్తూ చెత్తకు కూడా పన్ను విధిస్తూ పరిపాలన చేస్తున్నదన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ కేంద్రంలో మోడీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై విపరీతమైన భారాలు మోపుతున్నా యన్నారు. ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని, మొదటి సంవత్సరంలోనే వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేస్తామన్న జగన్ మోహన్‌రెడ్డి నాలుగు సంవత్సరాలైనా కేవలం 100 కోట్లు బడ్జెట్ కేటాయించి వచ్చే సెప్టెంబర్ నాటికి పూర్తి చేస్తాననడం హాస్యాస్పదమన్నారు. ఈ ప్రచార భేరి సభలో సీపీఎం జిల్లా నాయకులు టీ తిరుపతిరావు, సీపీఐ గిద్దలూరు నియోజకవర్గ సహాయ కార్యదర్శి జోసెఫ్, ఉభయ పార్టీల నాయకులు దానం, నరసింహులు, మూర్తి, పూర్ణ ఎంఎస్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ పాలనపై విసిగెత్తిన ప్రజ: జగదీశ్

విశాలాంధ్ర-రాప్తాడు: కేంద్రంలోని మోదీ తొమ్మిదేళ్లపాలన కోట్లకు పడగలెత్తిన కుబేరులకు తప్ప, సామాన్య ప్రజలకు ఏమాత్రం ఉపయోగ కరంగా లేదని... రైతులు, కార్మికులు, యువకులతో పాటు అన్ని వర్గాల ప్రజలు మోదీ పాలనపై విసుగెత్తి ఉన్నారని ఆయనను ప్రధాని ఉద్యోగం నుంచి తప్పించడానికి ఎన్నికల కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.జగదీశ్ అన్నారు. నరేంద్ర మోదీని గద్దె దీంపండి.. దేశాన్ని కాపాడండి అనే నినాదంతో ప్రచారభేరిలో భాగంగా సీపీఐ రాప్తాడు నియోజకవర్గ కార్యదర్శి పి.రామకృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం అనంతపురం రూరల్ మండలం కందుకూరు ఎఫ్. సి. ఐ. గోడౌన్ నుంచి సమతాగ్రామ్ వరకు పాదయాత్ర చేశారు. ఈప్రచారభేరికి సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు సి. జాఫర్, వి.రాంభూపాల్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు మల్లికార్జున, నారాయణస్వామి, రైతు సంఘం జిల్లా నాయకులు ఆర్.చంద్రశేఖర్ రెడ్డి, హాజరయ్యారు. జగదీశ్ మాట్లాడుతూ ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తూ దేశంలో నిరుద్యోగ సమస్యను పూర్తిగా రూపుమాపుతానని, యువతకు హామీ ఇచ్చిన మోదీ.. ప్రధాని అయ్యాక వాటిని పెడచెవిన పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో అందరూ ఏకతాటిపైకి వచ్చి మతతత్వ బీజేపీని ఓడిద్దామని పిలుపునిచ్చారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రయోజనాలను కాపాడవలసిన సీఎం జగన్ తన కేసులకు భయపడి మోదీకి అవసరం లేకపోయినా పరోక్ష మద్దతు ఇస్తూ ఏపీ ప్రజలను నిలువునా మోసం చేస్తున్నాడని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వైఎల్ రామాంజనేయులు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రాజారెడ్డి, రాప్తాడు నియోజకవర్గ సహాయ కార్యదర్శులు నాగరాజు, శ్రీకాంత్, సిపిఐ అనంతపురం రూరల్ మండల కార్యదర్శి రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మోదీ నిరంకుశ పాలనకు చరమగీతం పాడుదాం: దేగా

విశాలాంధ్ర బ్యూరో -ఏలూరు: రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్న మోదీ నిరంకుశ పాలనకు చరమగీతం పాడాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు దేగా ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం స్థానిక రామచంద్రరావు పేట పార్కు వద్ద సీపీఐ, సీపీఎం ప్రచారభేరి ముగింపు బహిరంగ సభ సీపీఐ ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్, సీపీఎం నగర కార్యదర్శి పళ్లెం కిషోర్ అధ్యక్షతన జరిగింది. ఈ బహిరంగ సభలో దేగ ప్రభాకర్ మాట్లాడుతూ మోదీ పాలనలో దళితులు, మైనారిటీలు, మహిళలపై దాడులు ఎక్కువ అయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. సైనికుల మనోభావాలను దెబ్బ తినే విధంగా మోదీ పాలన కొనసాగుతోందన్నారు. సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, సీపీఎం జిల్లా నాయకులు బి సోమయ్య ప్రసంగించారు. ఈ బహిరంగ సభలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పుప్పాల కన్నబాబు, కొండేటి బేబీ, చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కడుపు కన్నయ్య, సీపీఎం జిల్లా నాయకులు కె శ్రీనివాస్, ఏ శ్యామల రాణి, పి ఆదిశేషు తదితరులు పాల్గొన్నారు.

గిద్దలూరులో

రాప్తాడులో

పాట విడుదల చేసిన 'కస్టడీ' చిత్ర బృందం

హైదరాబాద్: అక్కినేని నాగ చైతన్య, కృతిశెట్టి జంటగా నటించిన చిత్రం 'కస్టడీ'. వెంకట్‌ప్రభు దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం మే 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. పవన్ కుమార్ సమర్పణలో శ్రీనివాస సిల్వర్ స్క్రీన్ బ్యానర్ పై శ్రీనివాస చిట్టూరి 'కస్టడీ' చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కాగా, ఈ చిత్రం నుంచి 'టైమ్ లెస్ లవ్' గీతాన్ని చిత్ర బృందం ఆదివారం విడుదల చేసింది. ఈ లిరికల్ వీడియో యూట్యూబ్ లో విడుదలైన కొద్దిసమయంనే వేల సంఖ్యలో వ్యూస్ సొంతం చేసుకుంది. మ్యాస్ట్రో ఇళయరాజా బాణీలకు రామజోగయ్య శాస్త్రి సాహిత్యం సమకూర్చారు. ఇళయరాజా తనయుడు యువన్ శంకర్ రాజా, కపిల్ కపిలన్ ఈ పాటను ఆలపించారు. కస్టడీ చిత్రంలో అరవింద్ స్వామి, ప్రియమణి, శరత్ కుమార్, సంపత్ రాజ్, ప్రేమ్ జీ అమరేన్, వెన్నెల కిశోర్, ప్రేమి విశ్వనాథ్ తదితరులు నటించారు.

విశాల్ కొత్త సినిమా షురూ

హైదరాబాద్: గతేడాది లాఠీ సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చాడు హీరో విశాల్. పాన్ ఇండియా బ్యాక్ డ్రాప్ కథాంశంతో తెరకెక్కిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ప్రేక్షకులను ఆకట్టుకో లేకపోయింది. ఇప్పటికే బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్నాడు విశాల్. ఇప్పుడు మరో కొత్త సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడన్న వార్త టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారింది. హరి దర్శకత్వంలో కొత్త సినిమాకు సంతకం చేశాడు. 'విశాల్ 34' ఆదివారం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. విశాల్ 34 గా వస్తున్న ఈ చిత్రం అనౌన్స్ మెంట్ పోస్టర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. చుట్టూ గన్స్, కత్తులు కనిపిస్తుండగా.. మధ్యలో స్టెతస్కోప్ చూడొచ్చు. విశాల్ ఇందులో డాక్టర్‌గా కనిపించబోతున్నట్టు తాజా లుక్‌తో అర్థమవుతోంది. మాస్ యాక్షన్ డ్రామా నేపథ్యంలో తాజా ప్రాజెక్ట్ ఉండబోతున్నట్టు సంకేతం ఇచ్చేశాడు డైరెక్టర్ హరి. ఈ చిత్రంలో కథానాయికగా ఎవరు నటించబోతున్నారు... ఇతర నటీనటులెవరనే దానిపై రాబోయే రోజుల్లో స్పష్టత రానుంది. స్టోన్ బెంచ్ ఫిలిమ్స్-జీ స్టూడియోస్ బ్యానర్లపై సంయుక్తంగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి దేవీ శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నాడు. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ షురూ కానుంది.

విషమంగానే శరత్‌బాబు ఆరోగ్యం

హైదరాబాద్: ప్రముఖ సినీ నటుడు శరత్ బాబు అస్వస్థతకు లోనైన విషయం విదితమే. ఆయనను ఈ నెల 20న హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రిలో చేర్పించారు. అయితే శరత్ బాబు ఆరోగ్యం విషమంగానే ఉన్నట్టు సమాచారం. శరీరం మొత్తం ఇన్‌ఫెక్షన్ వ్యాపించడంతో ఆ ప్రభావం కిడ్నీలు, ఊపిరితిత్తులు, కాలేయంతో పాటు ఇతర అవయవాలపై పడ్డట్టు ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం శరత్‌బాబుకు ఐసీయూలో వెంటిలేటర్‌పైనే చికిత్స నందిస్తున్నామని డాక్టర్లు తెలిపారు.అనారోగ్యంతో కొన్ని రోజులుగా బెంగళూరులోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శరత్ బాబును మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఏఐజీకి తీసుకొచ్చారు. శరత్‌బాబు త్వరగా కోలుకోవాలని సినీ ప్రముఖులు, అభిమానులు ప్రార్థిస్తున్నారు. తెలుగు, తమిళం, మలయాళ, కన్నడ భాషల్లో చాలా సినిమాల్లో నటించిన శరత్‌బాబు విభిన్న పాత్రలు పోషించారు. శరత్‌బాబు 2021లో పవన్ కల్యాణ్ నటించిన వకీల్‌సాబ్‌లో డిసిప్లీన్ కమిటీ చైర్మన్‌గా కనిపించారు. ఈ ఏడాది బాబీ సింహా హీరోగా నటించిన నటించిన వసంత కోకిల చిత్రంలో నటించారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.